

రాష్ట్ర విభజన తరువాత తొలిసారిగా సాగునీటి సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఇవి ఎంతో కీలకమైనవి. వీటి పరిధిలో పనులు చేసేది ఆయా సంఘాల అధ్యక్షులే. ఇంతకుముందు రూ. 5 లక్షల లోపలే పనులు చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 10 లక్షల లోపు పనులు చేసేలా నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా సంఘాల ఎన్నికలకు ప్రాధాన్యం పెరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేవు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులంతా ఈ ఎన్నికలపైనే పడ్డారు. మొత్తం ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా జనసేన, బీజేపీలకు కూడా ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలంటూ టీడీపీ అధిష్ఠానం ఆదేశాలు ఇవ్వడంతో ఏమి చేయాలో పాలుపోక వారంతా తలలు పట్టుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో గట్టెక్కేదెట్టా...? అని ఆలోచిస్తున్నారు.

# గట్టెక్కేదెట్టా...?

- ఎమ్మెల్యేలకు తలనొప్పిగా నీటి సంఘాల ఎన్నికలు
- జనసేన, బీజేపీకు వాటాపై అధిష్ఠానం ఆదేశాలు
- ఏమిచేయాలో పాలుపోక అగచాట్లు
- ఏకగ్రీవం దిశగా యత్నాలు

నెల్లూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో పెద్దగా ఆశ్చర్యం ఏమీలేదు. కాకపోతే ఈ నోటిఫికేషన్‌తో టీడీపీ ఎమ్మెల్యేలకు తలపోటు ఆరంభమైంది. ఇంకా రెండేళ్ల వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు లేకపోవడం, సాగునీటి సంఘాలు రూ.10 లక్షల పరిమితి వరకు పనులు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో సహజంగానే ఈ పదవులకు పోటీ పెరిగింది. సొంతవర్గంలో గ్రామస్థాయిలో మొదలైన ఈ పోటీని తట్టుకోలేక ఎమ్మెల్యేలు సతమతం అవుతున్నారు. ఈ క్రమంలో కూటమిలోని జనసేన, బీజేపీలకు కూడా వాటా ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశించింది. దీంతో ఎవరిని పక్కనపెట్టాలో అర్థం కాక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల తరువాత గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.



సంగంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

**14,17 తేదీల్లో ఎన్నికలు**

జిల్లా పరిధిలో 765 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటిలో ప్రాజెక్టు కమిటీలు మినహా మిగిలిన వాటికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. సాగునీటి సంఘాలకు ఆ చెరువు పరిధిలోని ఆయకట్టుదారులు ఓటర్లుగా ఉంటారు. వీరు సాగునీటి సంఘ అధ్యక్షులను ఎన్నుకుంటారు. సాగునీటి సంఘ అధ్యక్షులు 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకొంటారు. ఈ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ప్రాజెక్టు కమిటీ సభ్యులను ఎన్నుకోవాలి. అయితే ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం ఇంకా తేదీని ప్రకటించలేదు.

- ప్రాజెక్టు కమిటీలు ఐదు
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 13
- నీటి సంఘాలు 765
- నీటి సంఘాలకు ఎన్నిక ఈనెల 14న..
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు

**పెరిగిన ప్రాధాన్యత**

జిల్లాలో సాగునీటి సంఘాలకు చాలా ప్రాధాన్యత ఉంది. సోమశిల ప్రాజెక్టు కారణంగా జిల్లా పరిధిలోని చెరువుల్లో 80శాతం ఏటా రెండు పంటలకు సరిపడే నీటి సామర్థ్యం ఉన్నవే. ఈ క్రమంలో సాగునీటి సంఘాలకు గ్రామాల్లో విలువ ఎక్కువ. పైగా చాలాఏళ్ల తరువాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఆసక్తి పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర విభజన తరువాత జరగలేదు. తొలిసారిగా కూటమి

(మిగతా 6వ పేజీలో)



పగుళ్లు ఏర్పడి పడిపోయేస్థితిలో జలాశయం ముందు గోడ

## రక్షణ గోడకు పగుళ్లు

- నిర్లక్ష్యం వీడని ఇంజనీర్లు

అనంతసాగరం, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం కుడివైపు ఉన్న రక్షణ గోడ పగుళ్లిచ్చింది. ఈ గోడ నెర్రెలుబారి అధ్వాన స్థితికి చేరుకున్నా జలాశయం ఇంజనీర్లలో చలనం లేదు. క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీరు వదిలిన సమయంలో నీటి నియంత్రణ చేస్తూ.. సాఫీగా పెన్నానదిలో ప్రవాహం కొనసాగేలా దీని నిర్మాణం చేపట్టారు. అంతేకాక ఈ గోడ సోమశిల గ్రామానికి రక్షణ కవచంగా ఉంది. క్రస్ట్‌గేట్ల నుంచి సుమారు 500 మీటర్ల పొడవు కలిగిన ఈ నిర్మాణంలో డిజైనింగ్ లోపం ఉన్నట్లు గతంలో నిపుణుల కమిటీ తేల్చింది. కానీ దాన్ని సరిదిద్దే పనులను మాత్రం ఇంజనీర్లు చేయలేదు. పగుళ్లిచ్చిన గోడతో ప్రాజెక్టు మనుగడకు ఎలాంటి ప్రమాదం ఉంటుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ ఎస్ఈ డీ వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఈ రామకృష్ణారావు, ఏఈఈలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎంబుక్‌ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన గండిపాళెం జలాశయం సమీపంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏఈలు జగన్నాథం, వరప్రసాద్ పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా

## మైనింగ్ వ్యవహారం

- కలెక్టర్ ఉత్తర్వులపై హైకోర్టుకు గనులశాఖ డీడీ
- జిల్లా పాలనాధికారి ఆదేశాలు నిలుపుదల
- తిరుపతి డీడీకి ఇన్‌చార్జి బాధ్యతలు
- నేడు విధులకు హాజరవుతా..: చంద్రశేఖర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనింగ్‌శాఖలో జరుగుతున్న వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత నెల 30న గనులశాఖ డీడీ చంద్రశేఖర్‌ను రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టరు ఓ ఆనంద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులు చెల్లవంటూ డీడీ చంద్రశేఖర్ ఈనెల 6న హైకోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ఈనెల 9న హైకోర్టు సస్పెండ్ చేసింది. హైకోర్టు కాపీ బుధవారం జిల్లాకు వచ్చింది. కాగా జిల్లా ఇన్‌చార్జి మైనింగ్ డీడీగా తిరుపతి గనులశాఖ డీడీ బాలాజీ నాయక్‌కు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ రావాల్సిఉంది. ఈ విషయమై మైనింగ్ డీడీ చంద్రశేఖర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన సరెండర్ ఆదేశాలను హైకోర్టు రద్దు చేసిందన్నారు. ఈ క్రమంలో తాను డీడీగా కొనసాగుతున్నట్లే అవుతుందన్నారు. కాబట్టి గురువారం విధులకు హాజరవుతానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇక ముందు ముందు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.

# బాధంతా ఒకటే

- బిల్లులు రాక వారు.. పర్సంటేజీలు అందక వీరు!
- నీరు-చెట్టు బిల్లుల అప్‌లోడ్‌కు ఇరిగేషన్ సిబ్బంది తిరకాసు
- పర్సంటేజీ కోసం పట్టుబడుతున్నట్లు కాంట్రాక్టర్ల ఆరోపణ
- చెల్లింపునకు ప్రభుత్వం నిర్ణయం
- కోర్టులో ఉన్న బిల్లులకు రూ.250 కోట్లు విడుదల
- జిల్లాలో సుమారు రూ.10 కోట్ల వరకు ఉన్న బిల్లులు
- ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

నెల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. చేసిన పనులకు బిల్లులు రాక గత ఐదేళ్లు నరకయాతన పడ్డ వీరికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేందుకు నిర్ణయించింది. ఇందుకు గానూ బడ్జెట్ కూడా విడుదల చేసింది. కానీ జిల్లాలోని ఇరిగేషన్ సిబ్బంది మాత్రం ఈ బిల్లులను అప్‌లోడ్ చేయడంలేదు. ప్రభుత్వం మారినా ఇరిగేషన్ శాఖలో పరిస్థితులు మాత్రం మారలేదు. పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులను అప్‌లోడ్ చేస్తామంటూ కొందరు ఇరిగేషన్ సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. జేఈ, డీఈల నుంచి బిల్లులు నెల్లూరు సెంట్రల్ డివిజన్‌కు చేరినా, అక్కడి నుంచి ముందుకు కదలడం లేదని సమాచారం. ఇప్పటికే పెట్టిన పెట్టుబడి, దానికి వడ్డీ కలుపుకుంటే వచ్చే బిల్లు అసలు సరిపోదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పుడు మళ్లీ అధికారులకు పర్సంటేజీలు ఇవ్వాలంటే ఇక నెత్తిన గుడ్డేసుకోవాల్సిందేనని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారు. ఇరిగేషన్ శాఖలోని తీరును వారికి తెలియజేస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



**ఎన్నో ఏళ్ల పోరాటం**

2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం కింద ఇరిగేషన్ శాఖలో పెద్ద ఎత్తున పనులు జరిగాయి. మొదటి నాలుగేళ్లు చేసిన పనులకు బిల్లులు వచ్చాయి. అయితే చివరి ఏడాది చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు నిలిపేసింది. విచారణల పేరుతో బిల్లులు ఇవ్వకుండా కక్షసాధింపులకు పాల్పడింది. మూడేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్న కాంట్రాక్టర్లు ఆ తర్వాత ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. ఒక్కొక్కరుగా హైకోర్టును ఆశ్రయించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు ఇస్తుండడంతో బిల్లులు చెల్లిస్తూ వచ్చారు. అయితే ఎన్నికలకు ముందు అయితే కంటెప్ట్ కేసులకు కూడా బిల్లులు చెల్లించలేదు. ఒక్క ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే సుమారు రూ.120 కోట్లు నీరు-చెట్టు పనుల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇందులో చాలా వరకూ హైకోర్టు ఉత్తర్వుల ద్వారా కాంట్రాక్టర్లు బిల్లులు సంపాదించుకున్నారు. మరో రూ.20 కోట్లకుపైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న బిల్లులు విలువ సుమారు రూ.10 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఒక్క సెంట్రల్ డివిజన్ పరిధిలోనే రూ.6 కోట్లకుపైగా ఉన్నట్లు ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఈ వివరాలను ఇరిగేషన్ అధికారులు బయటపెట్టకపోతుండడం గమనార్హం.

**ఇరిగేషన్ సిబ్బంది తీరుపై విమర్శలు**

వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపులకు చాలా మంది పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆస్తులు అమ్ముకొని అప్పులు కట్టుకున్నారు. ఇంకొందరు ఇంకా అప్పుల ఊబిలో నుంచి బయటకు రాలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ కూడా నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు అనేక పోరాటాలు

(మిగతా 6వ పేజీలో)





రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటు పనులను ప్లాట్‌ఫామ్‌పై కూర్చొని పర్యవేక్షిస్తున్న కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, ఎస్ఈ వరలక్ష్మి

# కొలిక్కిరాని గేటు సమస్య

- రాళ్లపాడు కుడి కాలువ గేటుకు నాలుగు రోజులుగా మరమ్మతులు
- సాగర్ నుంచి మెకానిక్ సిబ్బంది రాక
- పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల
- ప్రాజెక్టు వద్దకు భారీగా తరలివచ్చిన రైతులు
- అయినా ఫలించని యత్నాలు

లింగసముద్రం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గత శనివారం దెబ్బతిన్న రాళ్లపాడు కుడి కాలువ తూము మొదటి గేటు సమస్య బుధవారం నాటికి కూడా ఓ కొలిక్కి రాలేదు. దెబ్బతిన్న గేటును తొలగించి రెండో గేటు ద్వారా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని వరినారుమళ్లకు, వరినాట్లకు నీరు ఇచ్చేందుకు మెకానిక్ షమీంబాషా, అధికారులు, సిబ్బంది ఆదివారం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు.మంగళవారం ఐదు టన్నుల చైన్ పుల్లీలు ఉపయోగించి గేటును పైకి లాగేందుకు మెకానిక్‌ల బృందం చేసిన ప్రయత్నం విఫలమైంది.దీంతో బుధవారం విజయవాడ నుంచి 10 టన్నుల చైన్ పుల్లీలు రెండింటిని తెప్పించి గేటును పైకి లేపే పనులు ప్రారంభించారు. మెకానిక్ సిబ్బంది తూము లోపలికి దిగి గేటుకు కొక్కేలను తగిలించి, ఈ చైను పుల్లీల ద్వారా పైకి లాగేందుకు ప్రయత్నించారు. అయితే గేటును పైకి లాగే సమయంలో బీమ్ వంగిపోవడం, చైన్ తెగిపోవడం జరిగింది. మళ్లీ మరో చైన్‌తో గేటు లాగే ప్రయత్నం చేశారు. కానీ రాత్రి 9 గంటల వరకు వారి ప్రయత్నాలు సఫలం కాలేదు.దీంతో భారీగా తరలివచ్చిన ఆయకట్టు రైతులు నిరాశతో వెనుతిరిగారు.

**పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు**

మరమ్మతుల విషయం తెలుసుకున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గేటు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్దకు వచ్చారు. గేటును పరిశీలించి అధికారులు, మెకానిక్‌ల బృందంతో చర్చించారు.అనంతరం జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ప్రభుత్వ సాగునీటి సలహాదారుడు కన్నయ్యనాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. కన్నయ్యనాయుడుతో ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లును మాట్లాడించి, ఆయన సలహాలు తీసుకున్నారు.అయితే నాగార్జునసాగర్ నుంచి నిపుణులైన మెకానిక్ సిబ్బందిని కూడా రప్పించారు. కానీ బుధవారం రాత్రికి కూడా గేటు పైకి లాగే పనులు పూర్తికాలేదు. కాగా గురువారం విశాఖపట్నం నుంచి నిపుణులైన మెకానిక్‌లను, సిబ్బందిని రప్పించి గేటును తొలగింపునకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యేలు తెలిపారు. అయితే, ఈ పనులను ఒంగోలు ఇరిగేషన్ ఎస్ఈ ఎస్ వరలక్ష్మి కూడా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కొండాపురం మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ పీ.చంద్రబాబు నాయుడు మండల రైతులు తదితరులు పాల్గొన్నారు



కుడి కాలువ తూములో దెబ్బతిన్న గేటును బుధవారం రాత్రి పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది



నెల్లూరులోని ఎస్ఎస్‌డీ ఆయుర్వేద నిలయంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

## విజిలెన్స్ తనిఖీలు

- ఆయుర్వేద దుకాణం సీజ్

నెల్లూరు(క్రైం),డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఆయుర్వేద మందుల దుకాణం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ దుకాణాన్ని సీజ్ చేశారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సమీపంలో శ్రీశివదుర్గ ఆయుర్వేద నిలయంలో ఆయుర్వేద మందుల విక్రయాలు సాగుతున్నాయి. అయితే ఈ దుకాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లేవన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు, ఆయుష్‌శాఖ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు లేవని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో మందుల దుకాణంలో ఉన్న రూ.6,97,839 విలువ చేసే మందులను సీజ్ చేశారు. అనంతరం దుకాణాన్ని కూడా సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం ఆంధ్రబోర్డ్ ఫర్ ఆయుర్వేదిక్, హోమియోపతి విజయవాడకు ఫిర్యాదు చేయనున్నట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు తెలిపారు.



## నిరుపయోగంగా ఆర్టీసీ బస్‌స్టేషన్

మండల కేంద్రమైన వలేటి వారిపాలెంలోని బస్ స్టేషన్ నిరుపయోగంగా మారింది. గ్రామంలో సుమారు 25 ఏళ్ల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో బస్‌స్టేషన్ నిర్మించారు. తొలినాళ్లలో బస్టాండు ప్రయాణికులతో కళకళలాడుతుండేది. అయితే క్రమేణా బస్‌స్టేషన్‌లోకి బస్సులు రాకపోవడంతో పాటు నిర్వహణను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్టాండు సెంటరులోని మూడు రోడ్ల కూడలిలో బస్‌షెల్టర్ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్ల వినియోగం లేక చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. అంతేగాకుండా రాత్రిళ్లు అసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)

## పంటలకు చీరలే శ్రీరామ రక్ష



పంటలకు చీరలే శ్రీరామ రక్ష అని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాల కొండ, పోలినేనిచెరువు, గరుకపాలెం, అంకభూపాలపురం, రామచంద్రాపురం, లింగపాలెం, కాకర్లవారిపాలెం, వీరన్నపాలెం పెద్దఅమ్మపాలెం గ్రామాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది. ఆయా గ్రామాల్లో సాగుచేసిన మినుము, పెసర, వరి తదితర పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు వాటినుంచి పంటలను కాపాడుకునేందుకు పంటల చుట్టూ పాత చీరలు, వలలు, మెష్‌లు, ఇనుప తీగలు కడుతున్నారు. అంతేగాకుండా రాత్రిళ్లు కుక్కలు, మనుషులు అరుస్తున్నట్లు రూపొందించిన మైక్‌లు ఏర్పాటుచేస్తున్నారు. కాగా, ఈ శబ్దాలు కొందరికి సత్ఫలితాలు ఇస్తుంటే, మరికొంత మంది రైతులకు గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు అడవి పందుల బెడద తప్పడం లేదు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)



# 'అభయం' సేవలు ఆదర్శనీయం

పక్కింట్లో మనిషి చనిపోతే చూడటానికి కూడా రాని ఈ రోజుల్లో అనాథ శవాలకు అన్నీ తామై దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఇలింద్ర వెంకటేశ్వర్లు (ఈవీఎస్), నూనె మోహన్. మృతదేహాల తరలింపు నుంచి అంత్యక్రియలు వరకు సొంత నిధులు వెచ్చిస్తున్నారు వీరిద్దరు. మామూలు సమయంలోనే కాదు కరోనా సమయంలో కూడా మృతదేహాలకు వీరు దగ్గరుండి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వీరిసేవలు గుర్తించిన ప్రభుత్వం 'మానవత్వ ధీర' అనే సేవా పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేసింది. 2014 లో స్థాపించిన ఈ సంస్థ ఇప్పటివరకు సుమారు 300కుపైగా అనాథశవాలకు అంత్యక్రియలు నిర్వహించింది. వీరిద్దరూ అందుబాటు లో లేనప్పుడు ఈవీఎస్ తనయుడు వంశీకృష్ణ, వీరి స్నేహితుడు పాదర్తి ఉదయ్ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

- అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు
- మృతదేహాల తరలింపు నుంచి దహనక్రియల వరకు సొంత నిధుల వ్యయం
- సంస్థ నిర్వాహకుల చేతుల మీదుగానే అన్నీ..
- మరెన్నో సామాజిక సేవల్లో ఈవీఎస్, మోహన్



హిందు శ్మశానంలో అభయం సంస్థ నిర్మించిన దహన సంస్కార మండపం

### ● ఆదర్శంగా సేవలు

ఆర్యవైశ్య సామాజికి వర్గానికి చెందిన ఈవీఎస్,మోహన్‌లు చేస్తున్న పనులను మొదట్లో వారి సామాజిక వర్గంవారే తప్పు బట్టారు. కాలక్రమంలో వారు చేస్తున్నది సామాజిక బాధ్యతని భగవంతుడి సేవ అని గుర్తించి నాడు విమర్శించినవారే.. నేడు అభినందిస్తున్నారు. ఒక్కో అనాథ శవం దహన సంస్కారాలకు సుమారు. రూ.10 వేలకుపైన ఖర్చు అవుతున్నా, వీరిద్దరే భరిస్తూ వారిని గౌరవంగా సాగనంపుతున్నారు. అనాథలకు దహనసంస్కారాలు నిర్వహిస్తే, అశ్వమేథ యాగం చేసినంత ఫలితం దక్కుతుందో కలియుగ పురాణంలో పేర్కొన్నారంటూ చెప్పే చాగంటి కోటేశ్వర రావు ప్రబోధాలను వీరు తూచా తప్పక పాటిస్తున్నారు.

### ● ఉచితంగా అంతిమయాత్రం రథం

'అభయం' తరపున అంతిమ యాత్రరథం (వాహనం)కొనుగోలు చేశారు. ఎవరైనా సంస్థకు ఫోన్ చేస్తే వారికి ఉచితంగా వాహనాన్ని పంపుతున్నారు. అంతేకాక ఆ వాహనానికి ఆయిల్ ఖర్చులు భరించి, తమ డ్రైవర్లు చేత మృతదేహాలను శ్మశానం వరకు తీసుకెళ్లి వదిలి వస్తున్నారు. మృతదేహా లను భద్రపరచే ఫ్రీజర్లను కూడా వారే సరఫరా చేస్తున్నారు. అయితే వాటి నిర్వహణకు మాత్రం నామమాత్రంగా రుసుం వసూలు చేస్తారు.

### ● రక్తదాన శిబిరాల ఏర్పాటు

రక్తం కొరతతో ఎవరూ ఇబ్బందులు పడకూడదని భావించి తమ సంస్థ తరుపున ప్రతిఏటా రిపబ్లిక్ డే రోజున మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 14 శిబిరాలు ఏర్పాటు చేశారు. గత ఏడాది 575 యూనిట్ల రక్తదానం చేసి రికార్డు నెలకొల్పా రు. అలాగే తమ సంస్థ ద్వారా నేత్రదానాలు చేపడుతూ, ఇప్పటి వరకు 18 మందితో నేత్ర దానాలు చేయించారు. అలాగే చనిపో యాక అవయవ దానం చేసేలా 120 మంది తో ఒప్పంద పత్రాలు రాయించారు.



అనాథ శవం చితికి నిప్పంటిస్తున్న అభయం స్వచ్ఛందసేవా సంస్థ నిర్వాహకులు, ఈవీఎస్, మోహన్ తదితరులు

### సేవలు సంతృప్తినిస్తున్నాయి...



అనాథ శవాలకు దహన సంస్కారాలు చేయడం తమకు ఎంతో సంతృప్తినిస్తున్నాయి. ఈవీఎస్ ప్రోత్సాహంతో 'అభయం'ను స్థాపించి నడిపిస్తున్నాం.తమకు వ్యాపారాల్లో వచ్చే ఆదాయం కన్నా అనాథలకు చేసే దహన సంస్కారాలే ఎక్కువ సంతృప్తినిస్తున్నాయి.ఇకముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- నూనె మోహన్, కావలి

### అనాథలను ఆదుకునేందుకే..



అనాథులను ఆదుకునేందుకే 'అభయం'ను స్థాపించాం. తొలుత ఫంక్షన్లలో భోజనాలు వృథాగా పారేయటాన్ని చూసి, ఆకలితో ఉన్న వారికి అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను స్థాపించాం. తర్వాత ఓ పేదరాలు ఫోన్ చేసి తన భర్త చని పోయారని, తనకు ఎవరూలేరని సాయం చేయాలని కోరింది. అక్కడికి వెళ్లి చూస్తే మనస్సు చలించింది. చివరి మజిలీలో కూడా ఇన్ని కష్టాలు ఉంటాయో..అని అనిపించింది. ఆ మృతదేహానికి అంత్యక్రియలు చేసేం దుకు సిద్ధం కాగా, తరలించేం దుకు వాహనం దొరకలేదు. దాంతో అప్పటి నుంచి అన్నీ తామై అంతిమ సంస్కారాలు చేస్తున్నాం.

- ఈవీఎస్, కావలి

## బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లిలో 15 ఏళ్ల బాలిక పని మీద బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. మూడు రోజుల కిందట పని మీద బయటకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో బాలిక కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎంతటికీ ఆచూకి తెలియకపోవడంతో బాలిక తల్లి వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాధంతా ఒకటే

(5వ పేజీ తరువాయి)

చేసింది. ఈ క్రమంలో అధికారంలోకి రాగానే నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపుకు కీలక నిర్ణయం తీసుకుంది. తొలి విడతగా హైకోర్టు పరిధిలో ఉన్న బిల్లులన్నింటినీ చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. అందుకు గానూ రూ.250 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. వెంటనే ఈ బిల్లులన్నింటినీ అప్‌లోడ్ చేసి చెల్లింపులు జరపాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించింది. మలి విడతగా మిగిలిన బిల్లులన్నింటినీ చెల్లించేలా నిర్ణయించింది. దీంతో పనులు చేసిన వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే వారి ఆనందం జిల్లాలోని ఇరిగేషన్ అధికారుల తీరుతో ఎక్కువ కాలం కొనసాగలేదు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయాల నుంచి బిల్లులను అప్‌లోడ్ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అక్కడ పని చేస్తున్న కొందరు సిబ్బంది పర్సంటేజీలు ఇస్తే గానీ బిల్లులు పంపేది లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నో తంటాలు పడ్డాక ఇప్పుడు ప్రభుత్వం దయచూపి బిల్లులు మంజూరు చేస్తే వాటిని ఇచ్చేందుకు కూడా ఇరిగేషన్ అధికారులకు మనసు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

### నా దగ్గర ఆగడం లేదు

నా దగ్గరకు వచ్చిన బిల్లులను వెంటనే పంపేస్తున్నా. నేను ఆపడం లేదు. కింది స్థాయి సిబ్బంది నుంచి బిల్లులు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.ఈ విషయాన్ని పరిశీలించి వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటా.

- నాగరాజు, నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ

## కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్

● వీక్షించిన జేసీ, డీఆర్వో



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను నెల్లూరు తిక్కన భవన్ నుంచి వీక్షిస్తున్న జేసీ కార్తీక్, డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విజయవాడలో తొలిరోజు బుధవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఓ ఆనంద్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను, సూచనలను శ్రద్ధగా విన్నారు. నెల్లూరుజిల్లా అభివృద్ధికి సంబంధించి సమగ్ర నివేదికను కలెక్టర్, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు తీసుకు వెళ్లారు. కాగా నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్‌రావులు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి సందేశాన్ని విన్నారు.



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

## నాగూర్ మీరాస్వాముల గంధం మత సామరస్యానికి ప్రతీక

● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

కావలిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం జెండాచెట్టు దర్గా వద్ద బుధవారం నాగూర్ మీరాస్వాముల గంధమహోత్సవం వైభవంగా జరిగింది. కావలిలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ గంధమహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తజనం తరలివచ్చి దర్గాలో ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాన్ని హిందు, ముస్లింలు కలిసి నిర్వహిస్తారు. విద్యుదీపాలంకరణలో నాగూర్ దర్గాను పోలిన భారీ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫకీర్ల బృందంచే తప్పెట్ల ఆధ్యాత్మిక గానమేళ, బెంగళూరు, తమిళనాడుకు చెందిన ఖవ్వాలి బృందాల మధ్య జుగల్ బంది (ఖవ్వాలి పోటీలు) సినీ పాటకచేరి, డ్యాన్స్‌బేబి డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### ● గంధమహోత్సవానికి సహకారం కొనసాగిస్తా : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

తాను పదవిలో ఉన్నా లేకున్నా రాజకీయాలకతీతంగా గంధమహోత్సవానికి తానందించే సహకారం కొనసాగిస్తానని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ప్రకటించారు. దర్గాలో ప్రార్థనలు నిర్వహించి దర్గా ఆచార సత్కారమందుకున్నారు.

### ● కనులపండువగా గంధం ఊరేగింపు

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం షేక్ ఖాదర్‌సాహెబ్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు ప్రారంభించి పురవీధుల మీదుగా దర్గా వరకు సాగింది. విశేష అలంకరణలు నౌరంగ్ బాజా, మంగళ వాయిద్యాలతో మిరిమెట్లు గొలిపే బాణాసం చా నడుమ నిర్వహించిన గంధమహోత్సవం ఊరేగింపు భక్తులను కనువిందు చేసింది. నిర్వాహక కమిటీ బాధ్యులు ఖాదర్‌బాషా (ఇట్టు) ముస్తాఫా, రఫీ, భక్తజనం పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హిందువులు, ముస్లింలు

## కందుకూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయండి

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో ఖాదీ, గ్రామ పరిశ్రమల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి జితన్ రామ్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రిని కలిసిన సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్లనాడు కందు కూరులో ఏర్పాటు చేసిన ఖాదీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందన్నారు, దాని స్థానంలో స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, భారత అంతరిక్ష రంగంలో గత ఐదేళ్లలో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలను తెలియ చేయాలని పార్లమెంటులో వేమిరెడ్డి కేంద్రాన్ని కోరారు. ఇందుకు ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. ఇస్రో, ప్రైవేటు కంపెనీల మధ్య అంతరిక్షానికి సంబంధించి ఎలాంటి ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులు లేవన్నారు. అంతరిక్ష పరిశోధన, సాంకేతిక అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం చర్యలుతీసుకుందని చెప్పారు.



కేంద్రమంత్రిని సత్కరిస్తున్న వేమిరెడ్డి

## గట్టెక్కేదెట్టా...?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వమే ఎన్నికలకు తెరలేపింది. చెరువుల పరిధిలో అభివృద్ధి పనులన్నీ సాగునీటి సంఘాల చేతుల మీదుగానే జరగనున్నాయి.దీంతో ఈ ఎన్నికలకు మరింత ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుతం రూ. 5లక్షలకు లోబడిన పనులన్నీ సాగునీటి సంఘాలకే కేటాయించాలన్నది నిబంధన. త్వరలో ఈ మొత్తాన్ని రూ.10 లక్షల వరకు పెంచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో చెరువులు, కాలువల అభివృద్ధి పనులన్నీ సాగునీటి సంఘాల చేతికే వస్తాయి. ఈ కారణంగా పోటీ కూడా పెరిగింది.

### ● ఏకగ్రీవం దిశగా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలంతా టీడీపీకి చెందినవారే. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం దిశగా సాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారం రోజులుగా ఎమ్మెల్యేలు ఈ పనిమీదే బిజీగా ఉన్నారు. సంఘాల పరిధిలోని గ్రామ నాయకులను పిలిపించి ఏకగ్రీవం దిశగా అభ్యర్థుల పేర్లు ఖరారు చేస్తున్నారు.

### ● ఎమ్మెల్యేలకు కొత్త చిక్కులు

అన్నీ సవ్యంగా సాగుతున్నాయనుకుంటున్న సమయంలో ఎమ్మెల్యేలకు కొత్త చిక్కులు ఎదురయ్యాయి. నిన్న మొన్నటి వరకు సాగునీటి సంఘాల ఎన్నికల్లో జనసేన,బీజేపీల ప్రస్తావన లేదు. ఈ రెండు పార్టీలకు గ్రామాల్లో పెద్దగా క్యాడర్ లేదు కాబట్టి... ఆయా పార్టీల నేతలు కూడా వీటిపట్ల ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలోనే భాగస్వామ్య పార్టీల సంగతి మరిచి పోయి, టీడీపీ నేతలు సంఘాల వారీగా అభ్యర్థులను ఎంపిక చేసుకొంటూవచ్చారు. అయితే సాగునీటి సంఘాల్లో జన సేన, బీజేపీలకు కూడా అవకాశం కల్పించాలని, ఆపార్టీ నేతలు సూచించే వారిని అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపిం చాలని, టీడీపీ అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలకు ఆదేశాలు అందాయి. అంతే వేగంతో జనసేన, బీజేపీ నాయకులు కూడా నియోజకవర్గాల వారీగా తమకు ఏ సాగునీటి సంఘాలు కావాలో తెలియ చేస్తూ జాబితాను ఎమ్మెల్యేలకు సమర్పిం చారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిని ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్నారు. జనసేన,బీజేపీ నాయకులు కోరే సంఘాలకు ఇదివరకే అభ్యర్థులను ఖరారు చేశారు. ఇప్పుడు వారికి ఎలా సర్ది చెప్పాలో అర్థం కాక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. మొత్తంమీద జిల్లా ఎమ్మెల్యేల నివాసాలు, కార్యాలయాలు సాగునీటి ఎన్నికల వాతావరణంతో సందడిగా మారాయి.

## నీటి సంఘాల ఓటర్ల జాబితాలో అవకతవకలు

● కాంగ్రెస్ నేతల ఆందోళన



మనుబోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మనుబోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీటిసంఘాల ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కంపేట, జట్లకొండూరు గ్రామాల ఓటర్ల జాబితాలో అనర్హులకు చోటు కల్పించారన్నారు. ఈ విషయమై గతనెల 13న ఆర్డీవోకి ఫిర్యాదు చేశామన్నారు.అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మరోమారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బళ్ల హరి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

వెంకటాచలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని కసుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్, షెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. నంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పది పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, సామాజిక సమస్యలను అధిగమించడంలో సైన్స్‌ను సాధనంగా మలిచి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికేందుకు సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ ఎడ్యుకేషన్ సీనియర్ మేనేజర్ కిషోర్, మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్, స్మైల్ ఫౌండేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయసారధి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ శేషయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు సుభాషిణి, మురళి, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌లో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సుధీర్‌బాబు

## సోమశిలకు
## 4,771 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 4,771 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.603 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువ 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

## కండలేరు నీటి మట్టం 55.8 టీఎంసీలు

రాపూరు, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : కండలేరు పూర్తి నీటి మట్టం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 55.8 టీఎంసీలు ఉంద ని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమ లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఇన్‌ఫ్లో 3వేలు క్యూసెక్కులుగా ఉన్నదని, వివిధ కాలువల ద్వారా అవుట్‌ఫ్లో 1395 క్యూసెక్కులు వెళ్తుందని ఆయన తెలిపారు.

## ఈ భవనాలు అసాంఘికాలకు నిలయాలు!

కావలి పట్టణంలో వినియోగంలో లేకుండా పాడుబడిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. పట్టణంలో అనేక చోట్ల నివాసయోగ్యానికి అనువుగాని సుమారు 200కు పైగా భవనాలను నిరుపయోగంగా వదిలేశారు. వాటిని కూల్చకపోవడంతో కొందరు ఆ భవనాల్లో మద్యం, జూదం, తదితర అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. దీనికి తోడు ఆ భవనాల ఆవరణలో మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా తయారు కావడంతో పగలు పందులు తిరుగుతూ రాత్రిళ్ల విష సర్పాలు ఉంటుండటంతో చుట్టు పక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు అలాంటి భవనాలను గుర్తించి తొలగింప చేసి ప్రజలకు వాటి నుంచి ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



## సీసీ రోడ్డును కమ్మేసిన కంపచెట్లు!



కావలి మండలం సిరిపురంలో లక్షలాది రూపాయలు వెచ్చించి గతంలో నిర్మించిన సీసీ రోడ్డును కంపచెట్లు కమ్మేశాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అయినా దీనిని పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామంలోని మసీదు ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లో తోలకపోవడంతో ఆ ప్రాంతంలో కంపచెట్లు మొలిశాయి. అవి పెరిగి రోడ్డును కమ్మేశాయి. దీంతోపాటు ఆ రోడ్డుపైనే చెత్త పోస్తుండడంతో అధ్వానంగా మారింది.

- కావలి రూరల్,(ఆంధ్రజ్యోతి)



# కప్పరాళ్లతిప్పలో కార్డన్ సెర్చ్

● 47 బైకుల స్వాధీనం ● ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న బైకులు, మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

బిట్రగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్ల తిప్పలో కావలి డీఎస్పీ శ్రీధర్ తమ సిబ్బం దితో కలసి బుధవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి 7 వరకు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తిప్పలోని ఇంటింటికి పోలీసులు వెళ్లి జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు జరిపిన కార్డన్ సెర్చ్‌లో పత్రాలు లేని 47 బైకులను, ఆటో, నాల్గుచక్రాల వాహనం సీజ్ చేశామని తెలిపారు. అలాగే అనుమానాస్పందంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నేరాలు, వాటికి సంబంధించిన శిక్షలపై తిప్పవాసులకు అవగాహన కల్పించామని తెలిపారు. కావలి డివిజన్ పరిధిలోని కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్సై బోజ్యాతో పాటు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది మొత్తం 120 మందితో కార్డన్ సెర్చ్ నిర్వహించామని డీఎస్పీ తెలిపారు.

# పర్లకొండలో యువకుడి దారుణహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కలువాయి, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత దారుణంగా కత్తులతో నరికి చంపి పరారైన సంఘటన బుధవారం ఉదయం కలువాయి మండల పర్లకొండ గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొల్లారు గోపి (27) ఉదయం 7.30గం టల సమయంలో ఇంటి వద్ద నుంచి సమీపంలోని నిమ్మతోట వద్దకు వెళ్లాడు. 9గంట లు అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వారి బంధువులకు చెప్పా రు. దీంతో వారు వెళ్లి చూసేసరికి తోటగేటు ముందు రక్తపుమడుగులో పడి మృతిచెంది ఉన్నాడు. వెంటనే వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే యువకుడు దారుణంగా హత్యకు గురికావడానికి గల కారణం తెలి యడం లేదు. సంఘటనా స్థలాన్ని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు, సంగం సీఐ విజయకృష్ణ, వేమారెడ్డి, ఎస్ఐ సుమన్ పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ రప్పించారు. మృతుడు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో రాయిపై పడి వ్యక్తి మృతి

అనంతసాగరం, 11 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రాయిపై పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ఇనగలూరులో బుధవారం చోటుచేసు కొంది. స్థానిక ఏఎస్ఐ మస్తాన్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు మస్తాన్ (45) అనంతసాగరంలో వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో కుటుం బ సభ్యులతో గొడవపడేవాడు. రెండు రోజుల క్రితం పూటుగా మద్యం సేవించి తన స్వగ్రామం ఇనగలూరుకు వెళ్లి తల్లిదండ్రులు నబీసా, ఖాదర్‌బీపై దాడిచేసి కొట్టాడు. ఈక్రమంలో కింద పడగా తలకు రాయి తగలి తీవ్ర గాయమైంది. దీంతో అతన్ని వైద్యం కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కోనేరులో వ్యక్తి ...

ఇందుకూరుపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నంలో వెలసి ఉన్న చాముండేశ్వరి ఆలయ కోనేరులో బుధవారం వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి విచారించారు. ఇందుకూరుపేట బీసీ కాలనీకి చెందిన నరాల దామోదర్(60)గా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం చాముండేశ్వరి దర్శనానికి వచ్చి కాళ్లు శుభ్రం చేసుకునేందుకు కోనేరులో దిగి ప్రమాదవశాత్తు కాలు జారీ పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి...

నెల్లూరు(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కొండాయపాలెం గేటు సమీపంలో బుధవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై క్రీమ్‌కలర్ హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, బులుగు రంగు ప్యాంట్ ఉన్నాయి. రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నెల్లూరులోని దర్గామిట్ట స్టేషన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని యనమలబావి సంఘంలో నరేష్ అనే వ్యక్తి ఇంట్లో గతనెల 23వ తేదీ రాత్రి చోరీ జరిగింది. ఒకటిన్నర సవర బంగారు, వెండి వస్తువులను అపహరించారు. రామ్‌నగర్ లో ఈ నెల 2వ తేదీ రాత్రి గౌస్‌బాషా ఇంట్లో ల్యాప్‌టాప్, ట్యాబ్ మాయ మయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో దర్గామిట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రోశయ్య నేతృత్వంలో ఎస్ఐ రమేష్‌బాబు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితులు గూడూరు ఇందిరా నగర్‌కు చెందిన పాతనేరస్థుడు డేవిడ్, గాంధీ నగర్‌కు చెందిన రాజేష్‌గా గుర్తించారు. బుధవారం పొదలకూరురోడ్డు వద్ద నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే పలు కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 89 |
| లేయర్ లైవ్ | 110 |
| స్కిన్ చికెన్ | 168 |
| స్కిన్‌లెస్ | 188 |
| లేయర్ | 187 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7401 |
| వెండి కిలో ధర | రూ. 95,300 |
| వెండి ఒక గ్రాము | రూ.98.30 |

# కేన్సర్ రోగులు ఎంతమంది ?

- ఇంటింటా ప్రత్యేక సర్వే
- వ్యాధిగ్రస్థుల గుర్తింపులో వైద్యసిబ్బంది
- 769 బృందాల నియామకం
- జిల్లాలో ఇప్పటికే 13వేలమంది రోగులు
- వచ్చే సెప్టెంబరు వరకు ప్రక్రియ

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి మూడు, నాల్గవదశకు చేరుకుంటే ఇక ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. ఒకవేళ ముందే గుర్తించినా ఈ వ్యాధికి చికిత్సల కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంతటి ప్రమాదకరమైన వ్యాధిని ముందుగా గుర్తించడం కూడా కష్టమే. ఈ నేపథ్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కేన్సర్ వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదేశాలు జారీ చేయటంతో వ్యాధిగ్రస్థులను గుర్తించే పనిలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

**● సర్వే ప్రారంభం**

ఈనెల 4న ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది సెప్టెంబరు వరకు నిర్వహిస్తామని వైద్యాధికారులు తెలిపారు. ఈ సర్వేలో 769 బృందాలు పాల్గొంటున్నాయి. ప్రతి బృందం రోజూ ఐదు ఇళ్లనే మాత్రమే క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఈ బృందంలో వైద్యులతోపాటు వైద్య సిబ్బంది పాల్గొని, వ్యాధిగ్రస్థులను గుర్తిస్తారు. అంతేకాక వ్యాధిగ్రస్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా చర్యలు తీసుకుంటారు. ఈ సర్వేలో కేన్సర్ రోగులతో పాటు మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్థులను కూడా గుర్తిస్తారు. వీరికి సంబంధించిన అన్నీ రకాల పరీక్షలు కూడా నిర్వహిస్తారు.

**● జిల్లాలో 13వేలమంది గుర్తింపు**

జిల్లాలో ఇప్పటివరకు 13వేల మంది కేన్సర్ రోగులు ఉన్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వీరంతా జీజీహెచ్‌తో పాటు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి, మెడికవర్, అపోలో ఆసుపత్రుల తోపాటు తిరుపతి సిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో కూడా చికిత్స పొందుతున్నారు.



ఇంటింటి సర్వేలో వైద్య బృందం (ఫైల్)

ఇదిలా ఉంటే ఈ సర్వే ద్వారా కేన్సర్ బాధితులు ఎంతమంది ఉన్నారు... వారికి సకాలంలో వైద్య చికిత్సలు అందుతున్నాయా. లేదా..? అన్న కోణంలోనూ పరిశీలిస్తారు. అసలు కేన్సర్ రావటానికి కారణాలేమిటి.. వంశపారంపర్యంగా వస్తుందా.. లేక ఎలాంటి చెడు అలవాట్లు ఉన్నాయి...? తదితర అంశాలను కూడా తెలుసుకుంటారు. అందుకు అనుగుణంగా చికిత్సలు అందిస్తారు.

### వ్యాధిగ్రస్థులకు మెరుగైన వైద్యం



జిల్లాలో కేన్సర్ వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ప్రస్తుతం ప్రత్యేక సర్వే చేస్తున్నాం. వ్యాధిగ్రస్థులు చికిత్సలు పొందుతున్నారా..? వారికి అందుతున్న చికిత్సలు ఎలా ఉన్నాయి.. అనేది కూడా పరిశీలిస్తాం. వ్యాధి లక్షణాలను బట్టి వారికి మెరుగై వైద్యం అందేలా చూస్తాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

## కేరళపై కేంద్రం కుట్ర

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష సంఘాలు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని వామపక్ష సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మూలి వెంగయ్య మాట్లాడుతూ కేరళలోని వయనాడ్‌లో వరద బాధితులకు అన్ని విధాలా సాయం చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ఆ రాష్ట్రానికి జీఎస్టీ రూపంలో రావాల్సిన లక్ష కోట్ల రూపాయలకుపైగా నిధులను ఆపేసిందన్నారు. సీపీఎం నేత చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజాపోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తూళ్లూరు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు, శ్రామిక మహిళా జిల్లా అధ్యక్షరాలు రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్థుల వివరాలు కో ఆర్డినేటర్లకు తెలపండి

● జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి



సమీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి ఫీల్డ్ కో ఆర్డినేటర్లకు తెలియచేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం ఎన్జీవో, టీబీ నివారణ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే క్షయ వ్యాధిగ్రస్థుల వివరాలు ఫీల్డ్ కో ఆర్డినేటర్లకు తెలపాలన్నారు. వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్సలు, మందులు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భవ్య ఎన్జీవో సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ తులసీరాం, హరీష్, విజయ్, జిల్లా క్షయ నివారణ విభాగం కో ఆర్డినేటర్ శ్రావణ్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి పోలీసు క్రీడలు

● హాజరుకానున్న 300 మంది



క్రీడాపోటీల కోసం మైదానాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

నెల్లూరు(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోలీసు క్రీడలు శుక్రవారం నుంచి మూడు రోజులు జరగనున్నాయి. నిత్యం విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీసులకు మానసికోల్లాసం కోసం ఏడాదికోమారు స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఆనవాయితీ. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించి వాటిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే స్పోర్ట్స్ మీట్‌కు పంపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పోలీసు స్పోర్ట్స్ మీట్ ఇప్పటికే పూర్తయ్యాయి. మన జిల్లాకు సంబంధించి నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఆటల పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం సబ్ డివిజన్ల వారీ క్రీడా జట్లను సిద్ధం చేశారు. 300 మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ... ఇలా అనేక అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ మీట్‌పై అదనపు ఎస్పీలు ఇప్పటికే సమావేశా లు ఏర్పాటు చేసి పలువురికి బాధ్యతలు అప్పగించారు.

## అప్రమత్తతతో వ్యాధుల నివారణ సాధ్యం



బ్లడ్ శాంపిల్స్ పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

సంగం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల అప్రమత్తతతో సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, వైద్యశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. సేకరించిన రోగుల బ్లడ్ శాంపిల్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇంకా వర్షాలు పడుతుండడంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో కుండీలు, టైర్లు, పారేసిన కొబ్బరి బోండాల్లో నీరు నిల్వ చేరితే లార్వా వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆశ, ఏఎన్ఎంలు ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించి ఇంటింటా సర్వేచేసి లార్వాను గుర్తించి నిర్మూలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బిట్రగుంట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ దక్షిణం ఎల్సీగేట్-144 వద్ద దిగువ మార్గంలో బుధవారం రైలు ఢీకొని 55-60 వయసు గల వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కావలి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్యాంకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఎల్సీ గేటు దాటుతుండగా బెంగళూరు నుంచి హౌరా వెళ్లే సూపర్‌ఫాస్ట్ హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై రమాదేవి తెలిపారు.

### పరిశ్రమల లైసెన్సులు
## రెన్యూవల్ చేసుకోండి

● జిల్లా ఫ్యాక్టరీస్ డిప్యూటీ సీఐ శైలేంద్రకుమార్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పరిశ్రమల లైసెన్సును వాటి యజమానులు రెన్యువల్ చేసుకోవాలని పరిశ్ర మల శాఖ జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025వ సంవత్సరానికిగాను లైసెన్స్ ఫీజును అపరాధ రుసుము లేకుండా ఈనెల 31లోగా చెల్లించవచ్చన్నారు. అలాగే వార్షిక రిటన్స్‌ను ఏప్రిల్ లోగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కోరారు.

## డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డీబార్

వెంకటాచలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్శిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 8602 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 7701 మంది హాజరుకాగా 901 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని సర్వోదయ డిగ్రీ కళాశాలలో ఒకరు, వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు, వెంకటగిరిలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ అవర్

నెల్లూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో బుధవారం స్కిల్ అవర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కే ఏడుకొండలు మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

## పునాది బలంగా ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చు

● జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు

వెంకటాచలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి : ప్రాథమిక తరగతులతో ముఖ్యంగా ఒకటి, రెండు తరగతులలో భాష, గణితం పరంగా పునాది బలంగా ఉంటే పిల్లలు అద్భుతమైన ఫలితాలు సాధించగలరని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు వెల్లడించారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో గత ఆరు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలను సాధించేటట్లుగా కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు

## సౌదీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులకు సౌదీ అరేబియా దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ ఆల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా ఈ అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. సౌదీలోని రీహాబిటేషన్ సెంటర్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 18 నుంచి 40లోపు వయసు కలిగి, ఏదైనా వైద్యశాలలో 18 నెలలు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీన ఫ్రీ అసెస్మెంట్ నిర్వహిస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500 తోపాటు జీఎస్టీ చెల్లించాలని, ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, విమాన టికెట్లకు ఆ రిజిస్ట్రేషన్ ఫీజు నుంచే చెల్లించడం జరుగుతుందన్నారు ఎంపికైన వారికి రూ.78 వేల నుంచి రూ.89 వేల వేతనం లభిస్తుందని తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోసం కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): జీతాలు, పెండింగ్ బకాయిలు చెల్లించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావలసిన రెండు నెలల జీతాలతోపాటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగయ్య, సీపీఎం నాయకులు డేవిడ్ రాజు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ ఉదంతంపై పౌరసమాజం స్పందించాలి


మాట్లాడుతున్న బీజేపీ నేత ఆర్డీ విల్సన్

కావలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలకు వ్యతిరేకంగా యావత్ భారత దేశం స్పందించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్ పిలుపునిచ్చారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బగ్లాదేశ్‌లో ఉన్న హిందువులు మతం మారాలని, అక్కడే ఉండాలంటే పన్నులు కట్టాలని తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇలా లక్షల మంది హిందువులపై అరాచకాలు జరుగుతుంటే భారత్‌లోని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు పెదవి విప్పకపోవడం బాధాకరమన్నారు. అక్కడ ఉన్న హిందువులు తమ ఆస్తులు అమ్ముకుని బయటకు రావాలన్నా రాలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. బంగ్లాదేశ్‌లో సెక్యులర్ రాజ్యాంగం ఉన్నప్పటికీ దమనకాండ జరుగుతూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి జషీయుద్దీన్ ఇది మాదేశ అంతర్గత విషయం అనడం దుర్మార్గమన్నారు. మానవహక్కులు అక్కడ ధ్వంసం అవుతుంటే ప్రశ్నించలేకపోవడం దారుణమన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా మాట్లాడుతున్న ఇస్కాన్ సంస్థ బాధ్యులు చిన్మయ్‌ని అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు కే. బ్రహ్మానందం, అంచిపాకల కమల, సీవీసీ సత్యం, మంద కిరణ్, రవింద్ర, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మార్కులు రిజిస్టరులో నమోదు చేయాలి


విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న స్వీయ మదింపు పరీక్షల్లో విద్యార్థుల జవాబు పత్రాలను వెంటనే ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి వారి మార్కులను రిజిష్టర్లలో నమోదు చేయాలని ఎంఈవో-1 మస్తాన్‌వలి సూచించారు. ఆయన బుధవారం మండలంలోని మాసాయిపేట మొయిన్, ఉర్దూ, దళితవాడ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిష్టర్లు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, అర్షియా, హాజిరా పాల్గొన్నారు.

## మాలల మహాగర్జన సభను జయప్రదం చేయండి



ప్రచారం నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

కందుకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని నల్లపాడులో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు, వివిధ సంఘాల జేఏసీ నేతలు కోరారు. బుధవారం కందుకూరు, వలేటివారి పాలెం, గుడ్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో యువత, ఉద్యోగులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాలేటి కోటేశ్వర రావు, బొట్లగుంట శ్రీనివాసులు, గుంటక మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా సర్వే నిర్వహించాలి

ఏఎస్ పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లార్వావ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి హెచ్ హుసేనమ్మ తెలిపారు. బుధవారం ఆమె చిరమన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిరమన, హసనపురం గ్రామాలలో ఇంటింటికీ తిరిగి లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యురాలు బి జ్యోతి రాణి, ఎస్‌యుఓ షేక్ ఖాదర్ బాషా,హెచ్‌ఈవో షేక్ షఫీ, ఎఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

### సమగ్రాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

బిట్రగుంట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధి లక్ష్యాలపై బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి పరిశీలకులు ఏ.రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు మహాత్మగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులపై గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో చర్చించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, ఈటీసీ లింక్ ఆఫీసర్ బీ.వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ నయామ్ తాజ్ హసన్, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం ప్రవీణ్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



### 'మోహన్‌బాబును అరెస్టు చేయాలి'

వింజమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలని స్థానిక జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు జర్నలిస్టు సంఘం నాయకులు గువ్వల రవీంద్రారెడ్డి, మిడతల హజరత్‌రెడ్డి, లెక్కమనేని రాజేష్‌నాయుడు, మూలి హజరత్‌రెడ్డి, సాధం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు దుత్తలూరు సీడ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఈనెల 15న కావలి, నెల్లూరు, 22న కందుకూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని మండలాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 29న దుత్తలూరు సీడ్స్‌లో ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఘన నివాళి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళ రచయిత, పత్రికా సంపాదకుడు సుబ్రమణ్యేశ్వరస్వామి జయంతి వేడుకలను స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జి. కృష్ణారెడ్డి, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రఘునాధరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


తూర్పుబోయమడగలలో పనిచేయని చేతిపంపు


గుంతలమయమై అధ్వానంగా ఉన్న రహదారి


ఇస్కపల్లి వద్ద తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

## సమస్యల వలయంలో పల్లెలు

- ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

వరికుంటపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. కొండ్రాజుపల్లి, తూర్పుబోయమడగల బస్టాండ్ సెంటర్లలోని చేతిపంపులు మరమ్మతులకు గురై ఏళ్ల తరబడి వెక్కిరిస్తున్నాయి. ఎన్టీఆర్ సుజల స్రవంతి, రక్షిత తాగునీటి పథకాల ట్యాంకులు సైతం నిరుపయోగంగా మారి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే రామాపురం నుంచి కాకొల్లువారిపల్లి మీదుగా రింగురోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. పలుమార్లు టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారిన రహదారులే దిక్కుగా మారాయి. పలు గ్రామాల ప్రధాన, అంతర్గత రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. జీ.కొండారెడ్డిపల్లి, వరికుంటపాడు, ఇస్కపల్లి, కాంచెరువు తదితర గ్రామాల్లో అతి తక్కువ ఎత్తులో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గువ్వాడి గ్రామంలోని ప్రధాన రహదారి వెంట పేడదిబ్బలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో అటుగా వెళ్లే ప్రజలతో సహా సమీపంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎక్కడ రోగాలపాలు కావాల్సి వస్తుందేమోనని బెంబేలెత్తిపోతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో నిర్మించిన నాడెప్ తొట్టెలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పల్లెల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



వలేటివారిపాలెం: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఇంటూరి

వలేటివారిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీభూమి-మీహక్కు కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి గ్రామంలో భూసమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా సర్వే చేస్తే అలాంటి సర్వేయర్లపై కేసులు నమోదు చేయాలని సూచించారు. నిజమైన భూహక్కుదారులకు అన్యాయం చేయవద్దని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తప్పు చేసిన అధికారులను ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, సర్పంచ్ సాధు శ్రీలత, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, టీడీపీ నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను అంజనేయులు, కాకుమాను హర్షకుమార్, వలేటి నరసింహం, కొంకా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

- సంగం : మండలంలోని కొరిమెర్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు సర్వే నెంబర్లు తేడా, విస్తీర్ణం, పాసు పుస్తకాలు వంటి పలు భూ సమస్యలపై వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.
- జలదంకి : రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకి 45రోజుల్లో పరిష్కారం దొరుకుతుందని తహసీల్దారు ప్రమీల పేర్కొన్నారు. మండలంలోని చామదల గ్రామసచివాలయలం ఆవరణలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ భూములకు సంబంధించి ఆన్‌లైన్ రికార్డులలో ఉన్న తప్పులపై అర్జీలు అందజేశారు. కొన్ని సమస్యలను తహసీల్దారు అక్కడే పరిష్కరించారు. ఈ సదస్సులో ఆర్‌ఐ శ్రీజ, వీఆర్వో మణికంఠ, తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి పాల్గొన్నారు.
- అల్లూరు : మండలంలోని బీరంగుంటలో బుధవారం తహసీల్దారు లక్ష్మీనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు తమ భూములపై వినతులు అందజేయగా కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈకార్యక్రమంలో వీఆర్వో సలామ్‌జీ, నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- ఉలవపాడు : మండలంలోని భీమవరం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సమస్యలపై 32 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ లావణ్య తెలిపారు. సదస్సులో మండల ప్రత్యేక అధికారి, జిల్లా డిప్యూటీ లేబర్ అధికారి ఎం వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ ఖాదర్ హుస్సేన్, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పరితపించే నేత చంద్రబాబు నాయుడు

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన దగుమాటి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల కోసం పరితపించే నేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, ఆయన సహకారంతో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే 12 మంది లబ్ధిదారులకు రూ.10,77,188 చెక్కులను అందచేశారు. ఆరోగ్యశ్రీ కిందకు రాని వారికి వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి నెల రోజులలోనే చెక్కులను అంద చేస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రయివేటు వ్యక్తుల ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ల్యాండ్‌టైటలింగ్ యాక్ట్ తీసుకు వచ్చి ప్రజల ఆస్తులు కాజేయాలని చూశారన్నారు. రీసర్వే పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించటానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వంలో మన సమస్య లను మన ముంగిటే పరిష్కరించటం జరుగుతోందన్నారు. బీద మస్తాన్ రావు తిరిగి టీడీపీలో చేరటం, రాజ్యసభ సభ్యుడిగా మళ్లీ ఎంపిక కావటం అభినందనీయమని, ఆయనతో కలిసి కావలిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల సమస్యలు తీరాలన్నా, తాగునీటి కష్టాలు తొలగాలన్నా ఈనెల14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్ బాబు, జ్యోతి బాబూరావు, బీద గిరిదర్, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఉప్పాల వెంకట్రావు, చిలకపాటి వెంకటేశ్వర్లు,రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : డీఈ

- సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల


ఉదయగిరి రూరల్ : నోటిఫికేషన్ విడుదల చేస్తున్న డీఈ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఇరిగేషన్ కార్యాలయ సబ్ డివిజన్ పరిధిలోని సాగునీటి చెరువులు, జలాశయాలు, డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి బుధవారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారి చంద్రమౌళి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి జలవనరుల శాఖ కార్యాలయ పరిధిలో 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లు చేశామన్నారు. పోటీచేసే అభ్యర్థి వారికి ఓటుహక్కు ఉన్న టీసీలోనే పోటీ చేయాలన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.

- సంగం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో నోడల్ అధికారి వినయ్‌కుమార్ సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. మండలంలోని రెండు మేజర్ సాగునీటి వినియోగదారుల సంఘాలు పడమటిపాళెం, అన్నారెడ్డిపాళెం, నాలుగు మైనర్ సాగునీటి సంఘాలైన జంగాలదొరువు, సంగం పంపింగ్ స్కీమ్, చెన్నవరపాడు, మర్రిపాడు నీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఆరు సాగునీటి వినియోగదారుల సంఘాల్లో 44 టీసీ మెంబర్లను ఓటు హక్కు కలిగిన రైతులు ఎన్నుకోనున్నారు. ఈ సంఘాల్లో మొత్తం 2407 మంది రైతులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఆమేరకు ఆయా ఎన్నికల పీవోలు ఆయా సాగునీటి సంఘాల ఎన్నికలపై పంచాయతీలు, సచివాలయాల్లో నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో అంటించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వినయ్‌కుమార్, పీవోలు పాల్గొన్నారు.
- వలేటివారిపాలెం : మండలంలోని చుండి, అంకభూపాలపురం, పోకూరు, శాఖవరం, బడేవారిపాలెం నలదలపూరు గ్రామాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు ఎన్నికల అధికారి నరేంద్రదేవ్, అసిస్టెంట్ అధికారి హర్షవర్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా నలదలపూరు గ్రామ సచివాలయంలో నోటీస్‌బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ పెట్టారు. ఈసదర్భంగా నరేంద్రదేవ్ మాట్లాడుతూ ఈనెల 14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, అనంతరం ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు.

### ఎంఎస్‌ఎంఈ సర్వేలో నమోదు చేయించుకోవాలి


ఆత్మకూరు: సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమలు నిర్వహించేవారు ఎంఎస్‌ఎంఈ సర్వేలో నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాళెం సచివాలయాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని సూచించారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్నుల వసూల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వేను పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### సర్వేకు సహకరించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ సచివాలయాల సిబ్బంది నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో అప్పాజి పేర్కొన్నారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కేటగిరి-2 విద్యుత్ కనెక్షన్ ప్రతి ఒక్కరికీ ఎంఎస్‌ఎంఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వే చేయించుకున్న ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతా యన్నారు. మ్యాపింగ్ కాకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు.

### ధర్నాను జయప్రదం చేయాలి

కావలిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ సూపర్ బూటకమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముసునూరులోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను, రైతులను నిలువునా ముంచారన్నారు. ఖరీఫ్ ముగిసి రబీ వచ్చినప్పటికీ అన్నదాత సుఖంగా లేరన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం లో అన్నదాతకు రైతుభరోసా కింద సంవత్స రానికి రూ. 13,500 అందించారని, చంద్ర బాబు ముఖ్యమంత్రి కుర్చీ కోసం బూటకపు వాగ్దానాలు చేసి గద్దెనెక్కి ప్రజలను దగా చేసారన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన జరగనున్న కలక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్న, రాఘవులు పాల్గొన్నారు.

## రాళ్లపాడు దెబ్బతిన్న గేటును తొలగించి నీరిస్తాం

- డీఈఈ ఎం వెంకటేశ్వర్లు



లింగసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు దెబ్బతిన్న గేటును తొలగించి రైతులకు నీరందిస్తామని డీఈఈ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

**? రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటు ఎందుకు దెబ్బతింది.**

! ఫెంగల్ తుపాను తరువాత కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి 17 అడుగులు, తరువాత కురిసిన వర్షాలకు 20 అడుగులతో ప్రాజెక్టు పూర్తిగా నిండింది. రైతులకు వరినాట్లకు నీరిచ్చేందుకు గేటు ఆపరేట్ చేస్తుండగా బోల్టు విరిగి కింద పడిపోయింది.

**? ఈ గేటును ఎప్పటికి తొలగిస్తారు**

! ప్రస్తుతం నిపుణులైన మెకానిక్‌ల ద్వారా గేటును తొలగించేందుకు కృషి చేస్తున్నాము. గేటు బయటకు రాకపోతే, దానిని పగులగొట్టి రెండవ గేటు ద్వారా నీరిస్తాం.

**? ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే రేడియల్ గేట్ల పరిస్థితి ఏమిటి**

! కొత్త స్పిల్‌వేలోని 5 గేట్లలో నాలుగు పనిచేస్తున్నాయి. 5వ గేటును ఆపరేట్ చేయడంలేదు. దీని రోప్ మరమ్మతులకు గురైంది.

**? పాత స్పిల్‌వే గేట్ల పరిస్థితి ఏమిటి.**

! పాత స్పిల్‌వేలోని 10 క్రస్టుగేట్లు, 2 పూడు గేట్లు పదేళ్ల నుంచి ఆపరేట్ చేయడం లేదు. అయితే ఆపరేట్ చేస్తే ఏదైనా జరుగుతుందని అనుమానం.

న్యూస్ బాక్స్

### పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

జలదంకి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జలదంకి పోలీస్‌స్టేషన్‌ను కావలి డీఎస్పీ శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. ఎఫ్‌ఐఆర్, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాలు అదుపు చేయడంలో ఎస్‌ఐ లతీఫున్నీసా, సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కలిగిరి సీఐ వెంకట నారాయణ ఉన్నారు.

### భూముల కబ్జాపై విచారణ

కావలిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కబ్జాపై బుధవారం ఆర్‌ఐ పృధ్వీ విచారణ చేపట్టారు. ముసునూరు మందాటి చెరువు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు మందాటి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ కనుమూరు భాస్కర్‌రెడ్డి లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుపై ముసునూరు అయ్యప్పగుడి పక్కన స్థలంలో చేపట్టిన నిర్మాణాలు పరిశీలించి ఆభూముల స్థితిగతులపై విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమలు కబ్జాపై లోకాయుక్త స్పందించడం రెవెన్యూ అధికారులు విచారణ జరిపడం శుభపరిణామమని, మందాటి చెరువు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ పోరాటం కొనసాగిస్తామని భాస్కర్ రెడ్డి తెలిపారు.

### రైతుసేవా కేంద్రాల పరిశీలన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి, బండగానిపల్లి గ్రామాల రైతుసేవా కేంద్రాలను బుధవారం ఏవో అంజనేయులునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సబంధించి పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వరి, మినుము, పెసర, వేరుశనగ, బుడ్డ శనగలు సాగు రైతులు బీమా చేయించుకోవాలని సూచించారు. అలాంటి వారికే ప్రభుత్వం నష్టపరిహారం ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఎరువుల యాజమాన్యంలో మెలకువలు పాటించాలి

అల్లూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వరిసాగులో ఎరవుల యాజమాన్యంలో రైతులు మెళలకువలు పాటించాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గంగపట్నం శీనయ్య, పాపనబోయిన జగన్మోహన్, వీఆర్వో మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం ఉదయం 10నుంచి 11గంటల వరకు డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డీఎం శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో తిరుగుతున్న బస్సు సౌకర్యాలు, లాజిస్టిక్ సేవలు, ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో ఏవైనా ఇబ్బందులున్నా, సౌకర్యాలు మెరుగుపర్చాలన్నా తగు సూచనలు, సలహాలు సెల్ నంబరు 9959225095కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పారిశుధ్య పర్యవేక్షణలో
# నిర్లక్ష్యం వద్దు

● కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించడంలో నిర్లక్ష్యం వద్దని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని 1వ డివిజన్ నవలాకులతోట, కోడూరుపాడు, నారాయణరెడ్డిపేట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మెరుగైన పారిశుధ్యానికి అవసరమైన వాహనాలను సమకూర్చాలని సూచించారు. ఆ ప్రాంతంలో మెగా ఇంజనీరింగ్ కంపెనీ నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును వెంటనే కార్పొరేషన్‌కు అప్పగించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు ట్రంకురోడ్డు పొడవునా జరుగుతున్న రోడ్డు ప్యాచ్ వర్కులను ఆయన పరిశీలించారు. కాగా, నగర రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా బుధవారం వాటి యజమానులతో కార్పొరేషన్ పశువైద్యాధికారి మదన్‌మోహన్ సమావేశం నిర్వహించారు. రోడ్లపై ఏ పశువు కనిపించినా గోశాలకు తరలించేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

# ...అయినా అదే మట్టి!

● నగరంలో మొక్కలు పెంచే మట్టిపై కమిషనర్ ఆక్షేపణ
● మార్చాలని ఆదేశించినా దానితోనే సరిపెట్టిన అధికారులు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని సుందరీకరణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నగరంలోని రహదారుల మధ్య ఉన్న డివైడర్లలో, రోడ్ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారు. కమిషనర్ సూర్యతేజ నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. అయితే నాణ్యతలేని మట్టిని తీసుకువచ్చి మొక్కలకు వాడుతున్నారని సాక్షాత్తు కమిషనరే గుర్తించారు. పొదలకూరురోడ్డుపై నూతనంగా నిర్మించిన డివైడర్‌పై మొక్కల పెంపకానికి తోలిన మట్టి నాసిరకంగా ఉంది. పుట్ట మట్టికి బదులు గ్రావెల్ మట్టిని, భవన నిర్మాణ వ్యర్థాలతో కూడిన మట్టిని ఉపయోగిస్తున్నట్లు కమిషనర్ పరిశీలనలో వెల్లడైంది. దీంతో ఉద్యాన అధికారి ప్రదీప్‌పై ఆయన మండిపడ్డారు. వెంటనే మట్టిని మార్చాలని ఆదేశించారు. ఇది జరిగి మూడు రోజులు గడుస్తున్నా కమిషనర్ ఆదేశాలు ఆచరణకు నోచుకోలేదు. పైగా బాగోలేదని చెప్పిన మట్టినే డివైడర్లలో కొనసాగిస్తూ బుధవారం చదును చేసేశారు. కమిషనర్ ఆదేశించినా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఆహార పదార్థాల్లో నిషేధితాలు వాడొద్దు

హోటళ్లలో వంటకాల తయారీలో ప్రభుత్వ నిషేధిత పదార్థాలు వినియోగించవద్దని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. బుధవారం ఆహార భద్రత విభాగం అధికారులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆహార పదార్థాల తయారీలో నిషేధిత వస్తువులు వాడుతున్నట్లు గుర్తించినా, వంటశాలలు పరిశుభ్రంగా లేకపోయినా, వ్యక్తిగత శుభ్రత పాటించకపోయినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ నందన్, డీసీ చెన్నుడు, ఎఫ్ఎస్‌వో వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.



డివైడర్లలో నింపిన మట్టి

### రేపు జొన్నవాడలో
## కృత్తిక దీపోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు కృత్తికా దీపోత్సవం కార్యక్రమ జరుగుతుందని ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని పేర్కొన్నారు.

## నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

విడవలూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. మండలంలో ముదివర్తి బిట్-1, చౌకచర్ల, ముదివర్తి బిట్-2, అలగానిపాడు, విడవలూరు, వరిణి బిట్-1, 2, వావిళ్ల చెరువుల కింద సుమారు 8వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈ 8 నీటి సంఘాలకు సంబంధించి ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆయా పోలింగ్ బూత్‌లలో ఎన్నికల ప్రత్యేకాధికారులు నోటిఫికేషన్ జాబితాను అంటించారు. ఈ సందర్భంగా తహసీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 14న నీటి సంఘాలకు సంబంధించి నామినేషన్‌ల స్వీకరణ, అదేరోజు లెక్కింపు, ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

## ఎన్నికలు సజావుగా జరగాలి

మనుబోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలను ఎన్నికల అధికారులు సజావుగా జరిగేలా చూడాలని తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 15 నీటి సంఘాల ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. అందులో 9 మైనర్, 6మీడియం చెరువులు ఉన్నాయన్నారు. 14వ తేదీన ఉదయం 10గంటలకు ఈ ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, డీటీ బషీర్, ఇరిగేషన్ ఏఈ. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డొంక బడి స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఫత్తేఖాన్‌పేట సగిలం వారి వీధిలోని మున్సిపల్ పాఠశాల (డొంక బడి) స్థలాన్ని కొంత మంది ఆక్రమించి కట్టడాలు నిర్మించారని స్థానికుడు ఏ సునీల్‌బాబు ఆరోపించారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పాఠశాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎన్ తిరుమలయ్య ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఏడు నెలల పాలనలో ఉద్యోగుల హామీలు ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కరువు భత్యం, మధ్యంతర భృతి, యాప్‌ల భారం తగ్గించడం, 11వ పీఆర్‌సీ, సరెండర్ లీవ్‌లు, పీఎఫ్ రుణాలు.. ఇలా అన్ని సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

## కొవ్వొత్తులతో జర్నలిస్టుల ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో సినీ నటుడు మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడులకు పాల్పడటాన్ని నిరసిస్తూ నగరంలోని జర్నలిస్టులు బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మోహన్‌బాబు చర్యలను తీవ్రంగా ఖండించారు. బాధితులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 'ఎంఎస్ఎంఈ' చైర్మన్‌తో జనసేన నాయకుల భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) రాష్ట్ర చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ను జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ బుధవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న తమ్మిరెడ్డి శివశంకర్ ఐఏఎస్ అధికారిగా, జీఎస్టీ విభాగంలో చేసిన సేవలు మరువలేనివన్నారు.



## నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నెల్లూరు-2 డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రయాణికులు 9959225642 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని పేర్కొన్నారు.

### రాపూరు డిపోలో...

రాపూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. రాపూరు ప్రాంత ప్రజలు, ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు తెలియజేయడానికి 99592 25651 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

## నేడు 'పోతన భాగవతం - కవితా వైభవం'

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేతన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పోతన భాగవతం కవితా వైభవం అనే సాహిత్య కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకుడు వై శేషగిరీశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువ ప్రవచనకర్త డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ పోతన భాగవతంపై ప్రవచిస్తారని తెలిపారు. సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

## నేటి నుంచి శిక్షణ తరగతులు

రాపూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈనెల 12, 13 తేదీల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో భవానీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటలకు జరుగుతుందని తెలిపారు.

## 21న సంగీత విభావరి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ధనలక్ష్మీపురం కేజేకే కల్యాణ మండపంలో ఈనెల 21న మెగా మ్యూజికల్ కాన్సర్ట్ జరుగుతుందని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయబాబు తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్లను బుధవారం మాగుంట లే అవుట్‌లోని ఓ బేకరీలో ఆవిష్కరించారు. సంగీత విభావరికి సినీ సింగర్స్ హారిక, రేవంత్ బృందం హాజరవుతుందని తెలిపారు.

## ఎన్నికల ప్రచారం కాదండో.. సభ్యత్వ నమోదు !

ఇదేదో ఎన్నికల ప్రచారమనుకుంటే తప్పులో కాలేసినట్లే.. ఇది అధికార టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక స్టౌబీడీ కాలనీలో టీడీపీ ఇన్‌చార్జి పఠాన్ నజీర్ నాయకత్వంలో నిర్వహించారు. ఇంటింటికీ, దుకాణాల వద్దకు తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. పడుగుపాడు గ్రామ పరిధిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని తెలుసుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)



## పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేయించాలి

● ఏడీ మురళీకృష్ణ

తోటపల్లిగూడూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పశువులకు కృత్రిమ గర్భ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పశుసంవర్థక శాఖ ఇందుకూరుపేట ఏడీ బి.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నచెరుకూరులో బుధవారం స్వర్ణభారత్ మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు సంవర్థకశాఖ సహాయంతో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులకు గురైన 15 గేదెలకు చికిత్స అందించామని తెలిపారు. దూడల్లో నట్టల నివారణకు 150 దూడలకు పరీక్షలు చేశామని, పాడి పశువుల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. పశుగ్రాసం పెంపకం వలన పోషకం ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి కోడూరు, ఈదూరు, జగదేవ్‌పేట పశువైద్యులు నరేష్, ప్రవీణ్, నాగేంద్ర, గోపాల మిత్ర, అమీర్ బాషా, టి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మళ్లీ గ్రావెల్ అక్రమ రవాణా

పొదలకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ నాయకులు కొండలు గుట్టలను కొల్లగట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా అధికార బలంతో ఇష్టారాజ్యంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. కొన్ని రోజులు ఈ గ్రావెల్ వ్యాపారం తాత్కాలికంగా ఆపినా, మళ్లీ బుధవారం తెల్లవారుజామున మండలంలోని బిరదవోలు నుంచి ఓ ప్రైవేటు కళ్యాణ మండపానికి జేసీబీ, ట్రాక్టర్‌తో విలువైన గ్రావెల్‌ను విచ్చలవిడిగా తోలారు. ట్రాక్టర్లలో మట్టి తరలించి అక్రమ దందాకు తెరలేపారు. ఒక టిప్పరు మట్టికి రూ.6వేలు, ట్రాక్టర్‌కు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు. అధిక లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారులు ఛిద్రమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ గ్రావెల్ తరలింపుపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.




## ఇళ్లల్లో చోరీల నివారణకు 'ఎల్‌హెచ్‌ఎంఎస్'

కోవూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోవూరు పోలీసుస్టేషన్ పరిధిలో తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలు జరగకుండా ప్రత్యేక యాప్ ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్)ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పండుగ సెలవులకు ఇతర గ్రామాలకు వెళ్లే ముందు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందిస్తే యాప్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసులు మఫ్టీలో గస్తీ కాస్తారని చెప్పారు. ఇంటికి తాళం వేసి గ్రామాలకు వెళ్తే వారు తిరిగి వచ్చేంత వరకు పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

## ఆలయాలు కూల్చడంపై ఆగ్రహం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణ కోసమని ముందస్తు సమాచారం ఇవ్వకుండా నగరంలోని నాగులమ్మ గుడి, మహాలక్ష్మి, విఘ్నేశ్వర ఆలయాలను బుధవారం తొలగించారు. దీనిపై హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. వారు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొం ది. వర్క్ఆర్డర్ అందుకోకుండా కాంట్రాక్టరు అత్యుత్సాహంతో ఆలయాలను కూల్చడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు.

## 'డీకేడబ్ల్యూ'లో నాన్‌వెర్బల్ క్యూస్‌పై సదస్సు

నెల్లూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా బుధవారం నాన్ వెర్బల్ క్యూస్ అనే అంశం పై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు, రీసోర్స్ పర్సన్ డాక్టర్ ఎం ఉషారాణి పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి మాట్లాడుతూ సమాజంలో కమ్యూనికేషన్ రంగంలో నాన్ వెర్బల్ క్యూస్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తున్నాయన్నారు. విద్యార్థులు వీటిపై పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ ఎస్ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వింధ్యావళి, వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు, అధ్యాపకులు ఉమామహేశ్వరి, డాక్టర్ వెంకటేశ్వర్లు, తమన్న పాల్గొన్నారు.

## డివిజన్‌కు రూ.కోటితో అభివృద్ధి పనులు

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రతీ డివిజన్‌లో రూ.కోటితో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టబోతున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం 24వ డివిజన్ కనుపర్తిపాడులో రూ.17 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ల వారీగా ప్రజల అవసరాలను గుర్తిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందచేస్తున్న సీఎం చంద్రబాబు, ఎంపీ వీపీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాగా, 30వ డివిజన్ వైఎస్ఆర్ నగర్ వద్ద రహదారి విస్తరణ, విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటరు అరవ శాంతి, నాయకులు అరవ శ్రీనివాసులు, మన్నేపల్లి రఘు, కూకటి హరి యాదవ్, చేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పులి హరికృష్ణ యాదవ్, బీమతాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

## బకాయిలు, ప్రమోషన్లు ఇవ్వండి

● హోంమంత్రికి పోలీసు అధికారుల సంఘం వినతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పోలీసు సిబ్బంది సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని, ప్రమోషన్లు కల్పించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని రాష్ట్ర హోం మంత్రి అనితను పోలీసు అధికారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో మంత్రికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎండీ మస్తాన్ ఖాన్, అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



హోంమంత్రికి వినతిపత్రం అందిస్తున్న పోలీసు అధికారుల సంఘం నాయకులు

## జోరెపల్లిలో రెవెన్యూ సదస్సు

రాపూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోరేపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు పీఎల్ నరసింహం, మండల టీడీపీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, మండల సర్వేయర్ శ్రీను, వీఆర్‌వో గంట పేరయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా గీతా జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇస్కాన్ మందిరంలో బుధవారం సాయంత్రం గీతా జయంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. శ్రీకృష్ణ భగవానునికి అభిషేకాలు, విశేష పూజలు, గీతాయజ్ఞం జరిగాయి, భగవద్గీత 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను భక్తులు పఠించారు. మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ స్వామి, భగవద్గీతపై ప్రవచనం చేశారు.


కాగా, మహాత్మాగాంధీ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరం జీర్ణోద్ధరణకు బుధవారం భూమి పూజ జరిగింది. ఈ ప్రాంగణంలోనే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా నిర్మించనున్నారు.



గీతా యజ్ఞం చేస్తున్న అర్చకుడు

# వరి నాట్లకు వర్షం దెబ్బ!

● నీటిలో మురుగుతున్న పైరు
● మారుతున్న వాతావరణంతో రైతుల్లో ఆందోళన



కోవూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు ఇంకా నీటలోనే మురుగుతున్నాయి. దీంతో ఇవి పనికిరాకుండా పాచిపోతుండగా మళ్లీ అల్పపీడనం ప్రభావంతో మారుతున్న వాతావరణం, భారీ వర్షాల సూచనలు వస్తున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా నవంబరు నెలాఖరులలో వర్షాలు సరిగా పడకపోవడంతో రైతులు వరి నాట్లేశారు. కోవూరు మండల పరిధిలోని పాటూరు, పోతిరెడ్డిపాళెం, కోవూరు, ఇనమడుగు, విడవలూరు మండల పరిధిలోని విడవలూరు, పార్లపల్లి, వావిళ్ల, కొడవలూరు మండల పరిధిలోని వెంకన్నపాళెం, దామేగుంట, బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని రేబాల, దామరమడుగు పరిసర ప్రాంత గ్రామ పొలిమేరల్లో నీటమునిగిన వరినాట్లు ఎక్కువ కాలం నీటిలో మునిగి ఉంటే పాచిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోవూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో నీట మునిగిన పంట పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి ఇందిరావతి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్లు ఎక్కువ కాలం నీటిలో పాచిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో నీరు తీసిన వెంటనే ఎకరానికి యూరియా 15-20 కిలోలు, పొటాష్ 15 కిలోలు వాడాలని, పొటాష్ వాడకం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సూచించారు. కొడుపులు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలు వరినారుమళ్లలో 5 సెంట్లకు ఒక కేజీ పిచికారి చేయాలని, పంటపొలంలో ఎకరాకు 10కిలోలు చల్లాలని, సూచించారు. ముందుగా నాటిన పొలాల్లో వర్షాల వల్ల ఆకుముడత తెగులు సోకే ప్రమాదముందని, నివారణకు ఫ్లూబెండిమైడ్ 20 మిల్లీ లీటర్ల మిశ్రమాన్ని ఎకరా పొలంలో పిచికారి చేయాలని తెలిపారు.

# అభివృద్ధిలో కొంచెం మోదం ఖేదం

సీఎం-కలెక్టర్ల కాన్ఫరెన్సులో వెల్లడైన జిల్లా సమాచారం

ఐదేళ్ల జగన్ పాలనలో కుప్పకూలిన వ్యవస్థలను నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం పెద్ద కసరత్తుకే పూనుకుంది. జిల్లాలవారీగా ఆయా రంగాల ప్రస్తుత స్థితిని సమాచార ప్రధానంగా బేరీజు వేసి, తగిన లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు సిద్ధమైంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగాల నుంచి బోలెడు సమాచారాన్ని పోగేసుకుని మథిస్తోంది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో బుధవారం మొదలైన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ సదస్సులో పాల్గొంటున్నారు. సదస్సులో వెల్లడైన సమాచారం ఆధారంగా జిల్లా వర్తమాన స్థితిగతులు ఇలా ఉన్నాయి...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

### జీవీఏలో జిల్లాకు నాలుగో స్థానం



జిల్లాలో జీవీఏ (స్థూల విలువ జోడింపు) రూ. 63,354 కోట్లుగా ప్రభుత్వం లెక్కించింది. రాష్ట్ర జీవీఏలో జిల్లా వాటా 5.18 శాతంగా నమోదైంది. జీవీఏ పరంగా రాష్ట్రంలో నాలుగో తిరుపతి జిల్లా 4వ స్థానంలో నిలుస్తోంది. ఇక జిల్లాలో ఒక ఏడాదిలో జరిగే వస్తు ఉత్పత్తుల, సేవల మొత్తం విలువ (జీడీడీపీ) రూ.67 వేల కోట్లుగా గుర్తించారు. 2022-23లో ఈ మొత్తం రూ. 67,487 కోట్లు వుండగా రానున్న ఐదేళ్లలో అంటే 2028-29 నాటికి ఇది రూ. 1,69,469 కోట్లకు చేరుకుంటుందని అంచనా కట్టారు. ఈవిధంగా రాష్ట్ర ఆర్థిక రంగానికి జిల్లా కీలక తోడ్పాటునందించే స్థాయిలో వుందని ఈ అంకెలు చెబుతున్నాయి.

### వద్దన్నా డెప్యుటేషన్లు



రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను ఇతర చోట్లకు డెప్యుటేషన్ వేయరాదంటూ ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. అయినా జిల్లాలో సచివాలయ ఉద్యోగుల డెప్యుటేషన్లు జరుగుతూనే వున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. అత్యవసర పరిస్థితుల్లో అది కూడా వారం రోజులకు మించకుండా డెప్యుటేషన్ వేయచ్చునని పరిమితులు విధించింది. కేవలం సీఆర్‌డీఏకి డెప్యుటేషన్ వేయడాన్ని మాత్రమే అనుమతించింది. కానీ జిల్లాలో ఏకంగా 122 మంది సచివాలయ ఉద్యోగులు డెప్యుటేషన్లపై ఇతర చోట్ల విధులు నిర్వర్తిస్తున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను డెప్యుటేషన్‌పై బదిలీ చేయడంలో జిల్లా నాలుగో స్థానంలో వుండడం గమనార్హం. ఇక వీరి హాజరు శాతం కూడా తక్కువగా ఉంటోంది. ఈ నెల మొదటి వారంలో నమోదైన ఉద్యోగుల హాజరు రికార్డులను పరిశీలిస్తే 5400 మంది ఉద్యోగుల్లో 4068 మంది మాత్రమే హాజరు నమోదు చేసుకున్నారు. 1332 మంది హాజరు నమోదు కాలేదు.

### పారిశ్రామికం భేష్.. వ్యవసాయంలో వెనుకడుగు

ఏడాదికి రూ. 24,505కోట్లు విలువైన పారిశ్రామిక ఉత్పత్తులు, సేవలు జిల్లా నుంచీ అందుతున్నాయి. ఈ రంగంలో రాష్ట్ర జీవీఏలో జిల్లా 7.78 శాతం వాటాతో ఏకంగా రెండవ స్థానంలో నిలిచింది. అదే విధంగా సేవా రంగంలో కూడా జిల్లా జీవీఏ రూ. రూ. 25,966 కోట్లుగా రికార్డు అయింది. ఈ రంగంలో రాష్ట్ర జీవీఏలో 5.44 శాతం వాటాతో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే వ్యవసాయ రంగంలోమాత్రం గణనీయంగా వెనుకబడింది. వ్యవసాయ రంగంలో జిల్లా జీవీఏ రూ. 12,883 కోట్లు కాగా రాష్ట్ర జీవీఏలో జిల్లా వాటా కేవలం 3.01 శాతం మాత్రమే. ఈ విషయంలో జిల్లా 18వ స్థానంతో వెనుకబడింది.



### పంటల బీమాలో దారుణ వైఫల్యం



జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా పథకం అమలు చేయడంలో అధికార యంత్రాంగం దారుణంగా వెనుకబడింది. జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 1.96 లక్షల ఎకరాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈనెల 9వ తేదీ నాటికి ఇందులో కేవలం 112 ఎకరాలకు మాత్రమే పంటల బీమా పథకం వర్తించేలా జిల్లా యంత్రాంగం ఎన్‌రోల్ చేసింది. నిర్దేశించిన లక్ష్యంలో ఇది 0.06 శాతం. పంటల బీమా కోసం వచ్చిన దరఖాస్తులు 263 మాత్రమే. సంబంధిత శాఖ యంత్రాంగం రైతులకు అవగాహన కల్పించి పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచడంలో విఫలమైనట్టు కనిపిస్తోంది.

### రోడ్ల నిర్మాణంలోనూ అట్టడుగున

ఉపాధి హామీ పథకం కింద చేపట్టే సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కంకర రోడ్ల నిర్మాణంలో కూడా జిల్లా అట్టడుగు నుంచీ రెండవ స్థానంలో నిలిచింది. ఈ మూడు రకాల రోడ్లకు సంబంధించి 951 పనులు మంజూరు కాగా అందులో 761 పనులు ప్రారంభమయ్యాయి. ఈ అంశంలో తిరుపతి జిల్లా 25వ స్థానంలో వుంది.

### ఉపాధి నిధుల వ్యయంలో అట్టడుగున..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా యంత్రాంగం తీరు ప్రభుత్వాన్ని అసంతృప్తికి గురి చేసేలా వుంది. మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధుల వ్యయంలో జిల్లా ఏపీ మొత్తం మీద అట్టడుగున నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 194 కోట్లు వ్యయం చేయాల్సి ఉండగా ఈనెల 9 వరకూ కేవలం రూ. 33.64 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈరంగంలో చిత్తూరు 10వ స్థానంలో ఉండగా తిరుపతి జిల్లా 17.34 శాతంతో చివరి స్థానంలో నిలిచింది.





### అడవుల్లో మనం మూడో స్థానం

జిల్లాలో మొత్తం 2644.87 చదరపు కిలోమీటర్ల నోటిఫైడ్ ఫారెస్ట్ ఏరియా వుంది. జిల్లా మొత్తం విస్తీర్ణంలో ఇది 37.35 శాతం. అడవులకు వెలుపల మరో 430.10 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెట్లు వున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. అటవీ విస్తీర్ణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మొదటి స్థానంలోనూ, పార్వతీపురం మన్యం జిల్లా రెండో స్థానంలోనూ వుండగా తిరుపతి జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

### గోకులాలలో 10వ స్థానం

జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో గోకులాలు పేరిట పాడిపశువులకు నిర్మిస్తున్న షెడ్ల విషయంలో జిల్లా పదవ స్థానంలో నిలిచింది. మొత్తం 1019 గోకులాలు మంజూరు కాగా అందులో 892 గోకులాల నిర్మాణం ప్రారంభమైంది. వాటిలో 22 మాత్రమే పూర్తయ్యాయి.

### ఆధార్ లేని పిల్లలు 61 వేలు

జిల్లాలో ఆరేళ్ళ లోపు వయసున్న పిల్లలు 63,831 మందికి ఆధార్ కార్డులు లేవని ప్రభుత్వం గుర్తించింది. వీరి ఆధార్ నమోదుకు ప్రభుత్వం ఒత్తిడి పెంచగా ఇప్పటి వరకూ 2071 మంది పిల్లల వివరాలు నమోదు చేశారు. ఇంకా 61,760 మంది పిల్లల వివరాలు నమోదు కావాల్సి వుంది.



### 2.14 లక్షల మంది ఆధార్ డేటా మిస్

ఆధార్ డేటా బేస్ నుంచీ మిస్ అయిన వారి సంఖ్య రాష్ట్రంలో 50 లక్షలు వుండగా జిల్లాలో 2.21 లక్షల మంది వున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఇలా మిస్ అయినవారి సంఖ్య 2,21,648. వీరిలో 7609 మందివి డేటా బేస్‌లో చేర్చారు. మిగిలిన 214139 మంది వివరాలు ఇంకా పెండింగ్ వున్నాయి.



# పర్యాటకమే అభివృద్ధికి ప్రధాన వనరు

- పులికాట్‌ను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలి
- రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి
- కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం



సీఎం కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టరు వెంకటేశ్వర్

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగమే అటు రాష్ట్రాభివృద్ధికి, ఇటు తిరుపతి జిల్లా అభివృద్ధికి ప్రధాన వనరని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. బుధవారం అమరావతిలో కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాపై సీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. జిల్లాకు సంబంధించి వివిధ రంగాల సమాచారాన్ని కలెక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పారిశ్రామిక రంగంలో మెరుగైన స్థితిలో ఉన్న జిల్లా.. తీర ప్రాంతం కారణంగా మరింత అభివృద్ధి చెందడంతో పాటు పర్యాటక రంగంలోనూ ప్రత్యేకతను సాధించే అవకాశం ఏర్పడిందన్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా పులికాట్ సరస్సులో పూడిరాయిదొరువు వద్ద పూడిపోయిన సముద్ర ముఖ ద్వారాలను తిరిగి తెరిపించాలన్నారు. దీనికి రూ. 97 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. దీంతో పాటు పులికాట్ సరస్సు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచడం ద్వారా పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. వివిధ జిల్లాల నుంచి రేషన్ బియ్యం తిరుపతి జిల్లా మీదుగానే తమిళనాడుకు అక్రమ రవాణా జరుగుతోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.దీనిని అడ్డుకోవాలని.. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని స్పష్టం చేశారు. అధికారులు, ఉద్యోగులకు కూడా కఠిన ఆదేశాలివ్వాలని సూచించారు. నెల రోజుల్లోపు రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. నామమాత్రంగా అర్జీలు తీసుకోవడం కాకుండా వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్డీవో స్థాయిలో అర్జీల పరిష్కారం జరిగిందా లేదా అన్నది పరిశీలించాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ కూడా తరచూ సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో సంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

## రెవెన్యూ సదస్సులకు 652 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా బుధవారం 47 గ్రామసభలు నిర్వహించామన్నారు. భూకబ్జాలపై 12, రీసర్వేకు 21. 22ఏ కు 83, ఇంటి స్థలాలకు 98, అసైన్‌మెంట్‌ల్యాండ్‌కు 40, ఆర్‌వోఆర్‌కు 289, ఇతర విషయాలకు సంబంధించి 81 చొప్పున 652 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో 19 అర్జీల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించామని తెలిపారు.

# వీళ్ల డేటా ఇవ్వండి

- టీడీఆర్ బాండ్ల లబ్ధిదారులపై సీఐడీ అనుమానం
- గొల్లవానిగుంట రోడ్డులోనే 32వాటికి డోర్ నెంబర్లు లేని వైనం
- మరో మూడు రోజులు ప్రత్యేక బృందాల విచారణ

తిరుపతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లపై సీఐడీ విజిలెన్స్ జరుపుతున్న విచారణలో భాగంగా పలువురు లబ్ధిదారులపై అనుమానం వ్యక్తం చేసింది. గొల్లవాని గుంట మాస్టర్ ప్లాన్ రోడ్డుకు సంబంధించి టీడీఆర్ బాండ్లు పొందినవారిలో 62 మంది వివరాలు కావాలని నగరపాలక సంస్థ అధికారులను సీఐడీ కోరింది. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన పీఎస్ గిరీష మంజూరు చేసిన 34 బాండ్లు, అదే విధంగా 16 బాండ్లు, 12 బాండ్లు చొప్పున అనుపమ అంజలి, హరిత ఆమోదించిన వివరాల జాబితాపై సీఐడీ దృష్టిపెట్టింది. వీటిలో 32 మంది లబ్ధిదారులకు వారి డోర్ నెంబర్లు కానీ, సమీప డోర్ నెంబర్లు కానీ సదరు జాబితాలో లేకపోవడంపై అధికారులు తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. డోర్ నెంబరు ఉన్నవాటికి పన్నులు వేశారా? వేసుంటే ఎంత విస్తీర్ణానికి ఎంత వేశారు? అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం.

**50 శాతం పూర్తయిన ఇంటింటి విచారణ**

టీడీఆర్ బాండ్ల క్షేత్ర స్థాయి విచారణకోసం వివిధ ప్రాంతాలనుంచి తిరుపతికి చేరుకున్న పది మంది అధికారుల బృందం మరో మూడు రోజుల పాటు మాస్టర్ ప్లాన్ రోడ్ల వెంబడి తిరగాల్సి ఉంది. గత మూడు రోజులుగా చేపట్టిన విచారణ 50 శాతం పూర్తయినట్టు తెలిసింది. విచారణలో భాగంగా ప్రతి టీడీఆర్ బాండు లబ్ధిదారుకు సంబంధించి 56 అంశాలపై వివరాణాత్మకంగా నివేదిక సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

## అక్కదేవతలారా దీవించండి!



తిరుమల మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద అక్కదేవతల ఆలయం ఉంది. దాదాపు 80 ఏళ్ల చరిత్ర ఈ ఆలయానికి ఉంది. 1940లలో తిరుమలకు తొలి కనుమదారి నిర్మాణం జరుగుతున్నపుడు ఇక్కడ అక్కదేవతల శిలలు కనిపించాయి. వాటిని తొలగించి నిర్మాణం కొనసాగించారు. అయితే అనేక అవరోధాలు ఎదురవుతూ నిర్మాణం క్లిష్టంగా మారిందని, ఆ సమయంలో అక్కదేవతల ప్రాముఖ్యం గురించి స్థానికులు అధికారులకు వివరించారని అంటారు. దాంతో వారు వెంటనే సప్తమాతృకలను రోడ్డుపక్కనే ఉన్న పెద్ద బండరాతికింద ప్రతిష్ఠంచారని చెబుతారు. అప్పటి నంచీ అక్కదేవతలకు పూజలు జరుగుతున్నాయంటారు. తిరుమల ఘాట్‌లో క్షేమంగా ప్రయాణాలు జరగాలని కోరుకుంటూ టీటీడీ రవాణా విభాగం 2008 నుంచీ అక్కదేవతలకు కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తోంది. శుక్రవారం ఉదయం ఇక్కడ టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



### శ్రీవారి సేవలో నటి వాసుకి

తిరుమల శ్రీవారిని బుధవారం సినీనటి, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి సతీమణి వాసుకి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆమె దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ఎలక్ట్రిక్ చోటా లగేజీ స్కూటర్



ఇది ఆటో కాదు.. ట్రాలీ కాదు.. బ్యాటరీతో నడిచే లగేజీ వాహనం. తిరుపతి నగరంలో సందుగొందుల్లో శబ్దం లేకుండా దూసుకుపోతూ సందడి చేస్తోంది. వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులకు మధ్యాహ్నాభోజనం తీసుకువెళ్లేందుకు ఇస్కాన్ సంస్థ ఈ వాహనం వినియోగిస్తోంది. చిన్న సందుల్లో వెళ్లడం ట్రాలీలకు కష్టంగా మారడంతో తమకు ఉపయోగపడేలా ఎలక్ట్రిక్ లగేజీ స్కూటర్‌ను మలచుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మినీ బ్యాటరీ ఆటోల గురించి తెలుసుకుని అనంతపురంలో ఒక లగేజీ స్కూటర్‌ను కొని ఇలా ట్రక్కులా మార్చుకున్నారు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చయింది. ఎండా,వానా ఏదొచ్చినా ఆహారపదార్థాలకు ఇబ్బంది లేకుండా బడులకు ఈ వాహనం చేరవేస్తోంది.

-తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





### హుండీ ఆదాయం రూ.4.27 కోట్లు


తిరుమల, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది.బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

**హుండీ(సోమవారం నాటిది) ద్వారా:** రూ.4.27 కోట్లు

**మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు :** 67,284

**తలనీలాలు సమర్పించినవారు:** 19,064

# శ్రీకాళహస్తిలో ఏడు గంగల వేడుక



భేరివారిమండపం (గంగమ్మ(ముత్యాలమ్మ)

జయ రామరావువీధి గంగమ్మ(కావమ్మ)

పెండ్లిమండపం గంగమ్మ(పొన్నాలమ్మ)

కొత్తపేట గంగమ్మ (భువనేశ్వరి)

బ్రాహ్మణవీధి నల్లగంగమ్మ(నల్లగంగమ్మ)

సన్నిధివీధి గంగమ్మ (అంకాలమ్మ)

గాంధీవీధి గంగమ్మ(అంకమ్మ)

శ్రీకాళహస్తి,డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరిగింది. గంగమ్మలను దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీకాళహస్తి పట్టణంలో యేటా డిసెంబరులో ఏడుగంగమ్మల జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అమ్మవార్లకు సారె సమర్పించారు. ఏడు ప్రాంతాల్లోని ఏడుగంగమ్మలను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా బుధవారం వేకువజామున 3 గంటల సమయంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చారు. కుంభం, ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. అక్కడి నుంచి ఏడుగురు అమ్మవార్లనూ ఒకరి వెనుక వరుసగా ఊరేగించారు. తప్పెట్లు, తాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు మధ్య భక్తులు తన్మయత్వంతో చిందులేశారు. బుధవారం రాత్రి ఏడుగంగమ్మలూ ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

### డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 వ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న పది మంది విద్యార్థులను డీబార్ చేశారు. తిరుపతిలో ముగ్గురు, చిత్తూరులో ఏడుగురిని డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

## సముద్రంలో 'అల'జడి

● ఆగిన చేపల వేట

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చదురు మదురుగా వర్షంతోపాటు చలిగాలులు వీస్తుండటంతో బుధవారం మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. కోట మండలంలోని పలు సముద్రతీర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడి వర్షపుజల్లులు పడుతున్నాయి. శ్రీనివాససత్రం, కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రం కసురుపై ఉండి ఒక్కసారిగా అలల ఉధృతి పెరగడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

## భూవివాదం కోర్టులో వున్నా దౌర్జన్యంగా కంచె తొలగించారు!

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సర్వే నెంబరు 478లో నా భూమి విషయమై తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబీకులతో వివాదం హైకోర్టులో పెండింగులో ఉండగానే.. దౌర్జన్యంగా కొందరు కంచెను తొలగించారంటూ బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తండ్రి ద్వారా సంక్రమించిన ఆ భూమిని ఇచ్చేయాలంటూ కొంతకాలం కిందట అప్పటి తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి, ఆయన సతీమణి రేవతీరెడ్డిల ప్రోద్బలంతో కొందరు తమపై పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. తన భూమిలోని 64 టేకు చెట్లు, 40 మామిడి చెట్లను కూడా నరికివేశారని, దానికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదు వెంట జతచేశారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా కేసు పెండింగులో ఉందని పేర్కొన్నారు. తాజాగా బుధవారం కొందరు వ్యక్తులు తన భూమిలోకి ప్రవేశించి ఎక్స్‌కవేటరుతో దౌర్జన్యంగా కంచెను తొలగించారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదుతో పాటు పంపించారు. గతంలో లాగానే మళ్లీ బెదిరింపులకు పాల్పడుతున్నందున తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేసిన బాధితుడు.. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని నిందితులను శిక్షించాలని కోరారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న అందరిపై కేసు నమోదు చేయాలని, తనకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను బాధితుడు కోరారు. కాగా, బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఎఫ్‌సీఐకి సంబంధించి ఏపీకి ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యుడుగానూ వ్యవహరిస్తున్నారు.

## ఆహార కొరతను అధిగమించేలా పరిశోధనలు జరగాలి

● జాతీయ సదస్సులో పశువైద్య విద్యార్థులకు పిలుపు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌రావు, షెజియన్ తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కొరతను అధిగమించేందుకు సరికొత్త పరిశోధనలు ఆవిష్కరించాలని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్‌మీల్స్ సంస్థ అధినేత డాక్టర్ ప్రకాశ్‌రావు సూచించారు. తద్వారా భావితరాలకు ఆహార భద్రత కల్పించాలన్నారు. 'పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి' అంశాలపై దేశంలోనే తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఎస్వీవెటర్నరీ కళాశాల వేదికగా చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. పశువైద్య విద్య విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి తమతోపాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించాలన్నారు. పారిశ్రామికవేత్తగా తన ఎదుగుదలను వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. దేశీయ ఆవుల, గేదె జాతుల జన్యుసమర్థతను ఉపయోగించుకుని భవిష్యత్తరాలకు మేలైన దేశీయ పశుజాతి రకాలు అందించాలని పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్ ఆకాంక్షించారు. తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనాంశాలకు సంబంధించి జాతీయస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర పశుసంవర్థకశాఖ మాజీ కమిషనర్ డాక్టర్ సురేష్ హోన్నప్పగల్ కొనియాడారు. వివిధ సెషన్స్‌లో దాదాపు 130 పరిశోధనాంశాలను ప్రజంటేషన్ చేయనున్నారని, వీటిలో ఉత్తమ పరిశోధనాపత్రాలను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేస్తామని సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.జగపతి రామయ్య వివరించారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. పలువురు పరిశోధకులు తమ పరిశోధనాంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.



### రంగనాథుడికి టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలోని రంగనాథ స్వామికి బుధవారం టీటీడీ తరఫున బుధవారం ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలు సమర్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన పుణ్యక్షేత్రాలకు టీటీడీ 2008 నుంచి పట్టువస్త్రాలను సమర్పిస్తోంది. అందులోభాగంగా ఈఏడాది కూడా శ్రీరంగం ఆలయానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్న టీటీడీ ఈవోకు శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ మరియప్పన్ స్వాగతం పలికారు. అనంతరం ఈవో.. పీఠాధిపతికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రధాన ఆలయ సముదాయంలో ఉన్న మూలవిరాట్ ఇతర ఉప ఆలయాలను దర్శించుకున్నారు. సాధారణంగా శ్రీరంగం ఆలయ అధికారులు ఏటా ఆణివారి ఆస్థానం రోజున తిరుమల ఆలయానికి వస్త్రాలను సమర్పిస్తారు. ఈ పవిత్ర కార్తీక మాసం ఏకాదశి రోజున శ్రీరంగం ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాలను అందజేస్తుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

### 18న ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్ కౌన్సెలింగ్

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ, డిపోల అలాట్‌మెంట్‌కు ఈనెల 18న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ 39, మోటార్ 2, ఎలక్ట్రీషియన్ 17, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 2 మొత్తం 62 ఖాళీలున్నాయి. ఐటీఐ అభ్యర్థులు ఆ రోజున ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

## మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు పెట్టాలి

● ఎస్పీ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ధర్నా

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబు, ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని జర్నలిస్టులు డిమాండు చేశారు. ఈ మేరకు తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం ఏపీయూడబ్ల్యుజే, ప్రెస్‌క్లబ్, ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. హైదరాబాదులో మోహన్‌బాబు, మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద సుమన్ టీవీ ప్రతినిధి ఉమాశంకర్, కెమెరామేన్ నరసింహపై బౌన్సర్లు దాడికి పాల్పడటం దారుణమని ఏపీయూడబ్ల్యుజే అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. వీడియో షూట్ చేస్తున్న తమను కొందరు బౌన్సర్లు అడ్డుకోవడంపై పీఆర్వో సతీష్ వచ్చి మాట్లాడుతుండగా.. వెనుక వైపు నుంచి 10 మంది బౌన్సర్లు వచ్చి తమపై దాడి చేసి కొట్టారని ఉమాశంకర్ తెలిపారు. పోలీసులు విచారణ జరిపి జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి డిమాండు చేశారు. హైదరాబాదు, తిరుపతిలో జరిగిన ఘటనలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర కోరారు. అనంతరం అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారికి వినతిపత్రం అందచేశారు. ఏపీ ఫొటోగ్రాఫర్ల సంఘం నేత గిరిబాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, సీనియర్ జర్నలిస్టులు దినేష్, రాజు, కల్లుపల్లి సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఆవిష్కరణలే దేశాన్ని అగ్రగామిగా నిలుపుతాయి

● ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఫినాలే పోటీల ప్రారంభం

ఏర్పేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'దేశంలో సాంకేతిక, విద్యారంగాల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం నూతన ఒరవడికి నాంది పలుకుతంది. ఈ కార్యక్రమం ద్వారా నూతన ఆవిష్కరణలెన్నో రూపొంది దేశాన్ని అగ్రగామిగా నిలుపుతుంది' అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం హ్యాకథాన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ వేడుకల్లో ఆయనతో పాటు తిరుపతి ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాల్లో జరుగుతున్న ఈ ఫినాలే పోటీల్లో 1,300 మంది యువ ఆవిష్కర్తల బృందాలు వివిధ అంశాలపై నూతన ఆవిష్కరణలు, కోడ్ సొల్యూషన్ ప్రక్రియలు చేపడుతున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఏర్పేడు ఐఐటీ ప్రాంగణంలో ఆరుగురు సభ్యులు, ఇద్దరు మెంటార్లు, 21 జట్లు సాఫ్ట్‌వేర్ కోడ్ సొల్యూషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఆయుష్ అంశాలపై కేంద్ర విద్య, ఆయుష్ శాఖల ద్వారా అందించిన సవాళ్లకు కొత్త ఆవిష్కరణలపై నిరంతరాయంగా 36 గంటల మేధో మదనాన్ని ప్రారంభించారు. ఉదయం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా దేశవ్యాప్తంగా ఫినాలే మారథాన్‌ను ప్రారంభించారు.

**శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమార్పులు**

దశాబ్దకాలంగా దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువ ఆవిష్కర్తలకు వివరించారు. సాయంత్రం ఆయన 51 నోడల్ కేంద్రాల్లో పాల్గొన్న వారితో వర్చువల్‌గా మాట్లాడారు. 2017లో జరిగిన హ్యాకథాన్‌లో 7వేల నూతన ఆవిష్కరణలు చేయగా ప్రస్తుతం 57వేలకు చేరిందన్నారు. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచామన్నారు.





వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు - టీమ్ స్టాక్ స్వాడ్ చేస్తున్న కోయంబత్తూరు విద్యార్థులు

## గదుల కోసం భక్తుల పాట్లు



గదుల కోసం 'పద్మావతి' ముందు నిరీక్షిస్తున్న భక్తులు

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం బుధవారం తిరుమలకు వచ్చిన భక్తులు వసతి కోసం ఇబ్బంది పడ్డారు. సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వోలోని కౌంటర్లు సాయంత్రానికే మూతపడ్డాయి. సిఫార్సు లేఖలపై గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ24 కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రానికి ఈ గదులూ బుక్ అయ్యాయి. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రులు వంటి ప్రజాప్రతినిధులు పరిమితికి మించి గదులు పొందటంతోనే ఈసమస్య వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్కో ప్రజాప్రతినిధి రెండు నుంచి మూడు గదులు పొందుతున్నట్టు సమాచారం. దీంతో ఎన్నడూ లేనివిధంగా సాయంత్రానికి పద్మావతిలోని గదులన్నీ బుక్ అయ్యాయి. ఈ మేరకు కౌంటర్లలోని సిబ్బంది మైకులద్వారా ప్రచారం చేశారు. దీంతో రిసెప్షన్ అధికారులు సాధారణ గదులనే పద్మావతికి మళ్లించి సిఫార్సు లేఖలపై అడపాదడపా కేటాయిస్తూ అర్ధరాత్రి వరకు నెట్టుకొచ్చారు. మరోవైపు ఎంబీసీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ గదుల కొరత మాత్రం భక్తులను ఇబ్బందులకు గురిచేసింది.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి



## నిరుపయోగంగా పోలీసు అవుట్‌పోస్ట్



గూడూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనార్దనరెడ్డికాలనీ సమీపంలో నిర్మించి న పోలీస్ అవుట్ పోస్టు గది నిరుపయోగంగా మారింది. చల్లకాలువ సమీపంలోని జనార్దనరెడ్డికాలనీ వద్ద 2003లో దాతల సహకారంతో పోలీస్ అసిస్టెన్స్ గది నిర్మాణ పనులను చేపట్టారు. ఈ గది నిర్మాణం దాదాపు పూర్తి చేసినా మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రధానంగా ఈ ప్రాంతంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండటంతో పాటు పట్టణ పొలిమేర కావడంతో ఇక్కడ నేరాలను నియంత్రించేందుకు, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు గతంలో చర్యలు చేపట్టారు. పోలీస్ అసిస్టెన్స్ గదిని నిర్మించి ఇక్కడ పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. అయితే భవన నిర్మాణం పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోలేదు. గత కొన్నేళ్లుగా నిరుపయోగంగానే నిలిచిపోయింది. దీంతో రాత్రి సమయాలలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. గది అసంపూర్తి పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గూడూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేగనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో ఎంపీటీసీ విఘ్నేశ్వర్‌లాల్, గోపీనాయక్, భక్తులు పాల్గొన్నారు.

## రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న సంజీవయ్య

నాయుడుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలైన రైతులకు అండగా వైసీపీ ఉంటుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం చేయాలని, ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను తొలగించాలని, వర్షాలకు తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరారు.

## సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయం ముఖద్వారం వద్ద సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీపీ ధనలక్ష్మి కోరారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పశు వైద్యశాల, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయని.. వర్షం పడితే కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడారు.

## నాయుడుపేటలో చిరుజల్లులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి చిరుజల్లులు పడ్డాయి. గ్యాస్‌లైన్ల కోసం రోడ్ల పక్కన గుంతలు తవ్వి ఉండటంతో కురిసిన వర్షానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## సర్వేలో కుటుంబ వివరాల నమోదు



మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి

బాలాయపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా సర్వేలో ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేయాలని డీఎల్‌డీవో వాణిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే, సచివాలయ సిబ్బంది హాజరు నమోదుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్ కుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ సేవలో డీఆర్‌డీవో మాజీ చైర్మన్



సతీష్ రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ

సూళ్లూరుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని బుధవారం ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, రక్షణ మంత్రి సైంటిఫిక్ అడ్వైజర్, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి దర్శించుకొన్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ ఆలయ మర్యాదలు చేసి అమ్మవారి దర్శనానంతరం వేద పండితులచే ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మునిరెడ్డి కాలనీకి చెందిన పృథ్వీ చెంగలం (59) మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై బోడిలింగాలపాడు శివాలయం వద్దకు వెళ్తూ మలుపు తిరుగుతుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విషయం విధితమే. గాయపడ్డ వ్యక్తిని చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించి వైద్యం అందించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## బాలసదనంలో వసతుల మెరుగుకు చర్యలు



బాలసదనంలో వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలసదనంలో వసతుల మెరుగుకు చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక నరశింగరావుపేటలోని బాలసదనం వసతిగృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. విద్యార్థినులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పేదలను విద్యలో ప్రోత్సహించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పలు నూతన సంస్కరణలను తీసుకొస్తున్నారన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీమ్, సీడీపీవో మొహబూబీ, కేశవనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

## 'చిరంజీవి కుటుంబానికి అండగా ఉంటాం'

వాకాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు చిరంజీవి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చిరంజీవి ఇంటి వద్ద మాట్లాడుతూ అతనిపై పలు తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. ఈ నేపథ్యంలో వెంకటగిరి నియోజకవర్గ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చిరంజీవికి స్టేషన్ బెయిల్ వచ్చేలా చేశామన్నారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరిగిందన్నారు. వైసీపీ కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండి కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

వాకాడు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గత 6 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు, నిడిగుర్తి మాజీ సర్పంచ్ వాకాటి సంపత్‌కుమార్ డిమాండు చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల ప్రజలు నిడిగుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని.. వైద్యుడి నిర్లక్ష్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు అవస్థలు తప్పడం లేదన్నారు. ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందిని వేధిస్తున్నారని.. ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## అవసరమైన పనులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వేణు

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు అవసరమైన పనులనే గుర్తించి చేపట్టాలని ఎంపీడీవో వేణు కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఉపాధి క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల శాతం పెంచాలన్నారు. వంద రోజుల పనులు, రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. నిర్లక్ష్యం చేసిన క్షేత్ర సహాయకులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్ శాంతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## చిట్టేడులో పోలేరమ్మ ఉత్సవం



పోలేరమ్మ అమ్మవారి ఊరేగింపు

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిట్టేడులో బుధవారం పోలేరమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, గంగపెట్టెతో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అమ్మవారికి అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కానుకలు సమర్పించారు.

## రేకుల షెడ్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

నాయుడుపేట, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రోటరీక్లబ్ సహాయంతో రేకుల షెడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజ్ గోపాల్, సభ్యులు చంద్రశేఖర్, కృష్ణారావు, రామచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌వర్మ, రోటరీక్లబ్ సభ్యులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## పోలీసులకు శారీరక ధారుడ్యం అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులు శారీరక ధారుడ్యం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక 9వ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు నమ్మకాన్ని కల్పించాలని కోరారు. ప్రభుత్వం పోలీసులకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. 9వ బెటాలియన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని.. ఇప్పటికే బెటాలియన్‌లో సీసీ రోడ్లు, అభివృద్ధి పనులు నిర్వహించామని తెలిపారు.

## పంటల బీమా తప్పనిసరి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ నాగర్జునసాగర్ అన్నారు. బుధవారం స్థానిక యాచసముద్రం, జంగాలపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి చెందిన రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా ఈనెల 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం పశువుల్లో వచ్చేవ్యాధులు వాటి నివారణకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, రామ్మోహన్, గోపీకృష్ణ, సుమతి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం కారూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి రైతులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నం చేసిందని.. ఆ చట్టాన్ని నేడు టీడీపీ ప్రభుత్వం రద్దుచేసిందని తెలిపారు. ప్రజలందరూ.. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు శరత్ బాబు, రెవెన్యూ, అటవీ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**ఓజిలి:** మండలంలోని కొండవల్లిపాడు, ఆచార్లపార్లపల్లి, రుద్రాయపాళెం గ్రామాలలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజలు పలు భూ సమస్యలపై అర్జీలు అందించారు. అర్జీలన్నిటికీ పరిష్కారం చూపుతామని తహసీల్దారు పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో రెవన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**బాలాయపల్లి:** మండలంలోని పాకపూడి, గొట్టికాడు గ్రామాల్లో బుధవారం తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు భూసమస్యలపై 23 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట:** మండల పరిధిలోని మంగానెల్లూరు, అచ్చుకట్ల గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ఎస్‌వి.నరసింహరావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ .శేఖర్, టీడీపీ నాయకులు గాడి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వాకాడు:** ముట్టెంబాక, జువ్వినట్టు గ్రామాల్లో తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో పలు సమస్యలపై 25 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అఖిల్, టీడీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ అనిల్‌రెడ్డి, మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కోట:** ఊనుగుంటపాళెంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతులు పలు భూసమస్యలపై 5 అర్జీలను అందించారు. తహసీల్దారు జయజయరావు, ఎంపీపీ అంజమ్మ, డీటీ అజమతుల్లాఖాన్, ఆర్‌ఐ మధులత, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

**పెళ్లకూరు:** భూవివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్లు సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం చిల్లకూరు గ్రామ సచివాలయంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోషీబాయి, వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ పూజిత, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పాపాడి రాజగోపాల్ రెడ్డి, సర్పంచి హరిబాబురెడ్డి, సిద్దులయ్యనాయుడు, పాలచ్చూరు సుబ్బరామయ్య, మునిచంద్ర, రాకేష్‌రెడ్డి, వేణురెడ్డి పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. గ్రామాల్లో చైతన్యం కల్పించాలని .. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని సీడీపీవో మునికుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో విధిగా సభ్యులకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించాలన్నారు. ఆడ పిల్లలను కాపాడుకుందామని.. నిర్దిష్ట వయసులో మాత్రమే వివాహం చేయాలని గడపగడపకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం



వ్యవసాయ ఉత్పత్తులు పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు నిల్వచేసుకోవచ్చని నాబార్డ్ జిల్లా మేనేజర్ బాబు పేర్కొన్నారు. బుధవారం తాళ్వాయిపాడులో నూతనంగా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్‌ను ఆయన ప్రారంభించారు. రైతుల పండించే పంటలకు మద్దతు ధర లేని సమయాల్లో తక్కువ రేట్లుకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారని. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో ధరలేని సమయంలో నిల్వ చేసుకుని మంచి ధరలు ఉన్నప్పుడు రైతులు విక్రయించుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో మయా వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ, మండల ఉద్యాన అధికారిణి శారద, కోల్డ్ స్టోరేజ్ డైరెక్టర్ కట్టా బాలసుబ్రహ్మణ్యం, ఎన్జీవో చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను బుధవారం అధికారులు విడుదల చేశారు. సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి మొత్తం 72 సాగునీటి సంఘాలకు ఎన్నికలకు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జలవనరుల శాఖ డీఈ శ్రీధర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి 18 మందిని ఎన్నికల అధికారులుగా నియమించారు.

## వైద్యులకు ముగిసిన శిక్షణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన వైద్య విధానాలపై ఎస్వీ వైద్య కళాశాలలో మూడు రోజులుగా వైద్య అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య విద్యలో నూతన అధ్యయనాలపై నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు కొత్త విషయాలు నేర్చుకునేందుకు దోహదపడతాయన్నారు. వైద్యులు మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, వైద్య విభాగాధిపతులు రమ్య పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నోటీసులు అందజేస్తున్న ఫుడ్ కమిషనర్ నర్మద

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యాపార యజమానులు తయారు చేసే వస్తువులపై నాణ్యత ప్రమాణాలు పాటించాలని తిరుపతి ఫుడ్ కమిషనర్ నర్మద సూచించారు. బుధవారం స్థానిక క్రాస్ రోడ్డు, పాత బస్టాండు, పోలేరమ్మ ఆర్చి సెంటర్, కాశీపేట తదితర ప్రాంతాల్లో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారాలు నిర్వహించే ప్రతిఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలన్నారు. పలు తినుబండారాల్లో కలర్ అత్యధికంగా వేస్తున్నారని 1శాతం మాత్రమే వేయాలని ఆదేశించారు. తినుబండరాలను బహిరంగ ప్రదేశాల్లో పెట్టకూడదని వాటిని బాక్సులు ఏర్పాటు చేసిన వాటిల్లో మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. వంట నూనెలు ఒకటి, రెండు సార్లు మాత్రమే వాడాలన్నారు. అనంతరం పలు దుకాణాలకు నోటీసులు అంటించారు.

## వైసీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటా: నేదురుమల్లి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11,(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో అండగా ఉంటామని వైసీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి తన నివాసంలో అందుబాటులో ఉంటానని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలకేంద్రం- పాత బస్టాండ్ దారిలో ఆటో, మోటర్ సైకిల్ ఢీకొన్న సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు శ్రీ కాళహస్తి మండలం మన్నవరం గ్రామానికి చెందిన తేజ మోటారు సైకిల్‌పై పాలకేంద్రం సమీపం నుంచి పాతబస్టాండ్ వైపు వస్తున్నారు. ప్రయాణికులు ఎక్కించుకుని ఆటో పాత బస్టాండు నుంచి పాలకేంద్రం వైపుగా వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తేజకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా భారతీయ భాషా దివస్



ఎస్వీయూలో సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, యూజీసీ ఆదేశాల మేరకు యూనివర్సిటీల్లో భారతీయ భాషా దివస్-2024 ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో కల్చరల్ అఫైర్స్ - ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆర్ట్స్ డీన్ మురళీధర్, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పద్మావతి వర్సిటీ ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని పాల్గొని మాట్లాడారు. మన భాష, సంస్కృతిని గౌరవిస్తూనే దేశంలోని అన్ని భాషలు, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉద్యోగులు హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

# పేద విద్యార్థులకు దన్నుగా ప్రభుత్వం

- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 101 వసతి గృహాలకు రూ.15.17కోట్ల మంజూరు



ఓ హాస్టల్లో పాడైపోయిన కిటికీలపై దుస్తులను ఆరేసుకున్న విద్యార్థులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది.ఐదేళ్ల వైసీపీ పాలనలో వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో పెచ్చులూడిన పైకప్పులు, శిథిలమైన మరుగుదొడ్లు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, రెక్కలు విరిగిన ఫ్యాన్లు, నీళ్లు కారుతున్న గదుల్లోనే విద్యార్థులు బస చేయాల్సి వచ్చింది.చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న తొలి నాళ్లలోనే వసతి గృహాల మరమ్మతులపై దృష్టిసారించారు. విద్యార్థులకు ఏమి అవసరమో గుర్తించి ఒకటికి రెండుసార్లు నివేదికలు తెప్పించుకుని ప్రభుత్వానికి పంపారు.ఈ నేపథ్యంలో వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.చిత్తూరు జిల్లా పరిధిలో 46 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.04 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.109.83 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్‌కు రూ.114.75 లక్షలు, కిటికీలకు మెష్‌ల ఏర్పాటుకు రూ.66.15 లక్షలు, డోర్లు, విండోల మరమ్మతులకు రూ.44.27 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.94.67లక్షలు, ఫ్లోరింగ్‌కు రూ.70.38 లక్షలు, ప్రహరీ నిర్మాణాలకు రూ.91.83లక్షలు, ఇతర పనుల కోసం రూ.205.71 లక్షలు కేటాయించారు.తిరుపతి జిల్లాకు సంబంధించి మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.122.71 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.82.11 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్ కోసం రూ.81.24లక్షలు, మెష్‌ల ఏర్పాటుకు రూ.46.80 లక్షలు, డోర్లు, విండోల కోసం రూ.67.92 లక్షలు, అవసరమైన ఇతర పనుల కోసం రూ.83.82 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.78.63 లక్షలు, ఫ్లోరింగ్ కోసం రూ.63.50 లక్షలు, ప్రహరీ నిర్మాణాల కోసం రూ.7.30 లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ పనులను చేపట్టి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసింది.